**విలేఖరులు కావలెను**

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136

RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం
ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers
JANASAMUDRAM.COM

సంపుటి:03 | సంచిక:276 | శుక్రవారం 09-05-2025 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00

## సమస్యల విషయంలో మేం గిరిగీసుకోలేదు: హైడ్రా కమిషనర్ రంగనాథ్



ముంపు బాధితుల సమస్యలను హైడ్రా వెంటనే పరిష్కరిస్తోందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

హైదరాబాద్: ముంపు బాధితుల సమస్యలను హైడ్రా వెంటనే పరిష్కరిస్తోందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ప్రజలు ఏ విభాగాన్ని సంప్రదించాలో తెలియని సమస్యల్ని హైడ్రా పరిష్కరిస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న హైడ్రా కార్యక్రమంలో భాగంగా సికింద్రాబాద్ బుద్ధ భవన్‌లో హైడ్రా పోలీస్ స్టేషన్ భవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హైడ్రా పోలీస్ స్టేషన్‌తో పాటు హైడ్రాకు సమకూర్చిన వాహనాలు, యంత్రాలను సైతం ప్రారంభించారు.

తరువాయి పేజి 2లో

# హైడ్రా అంటే కూలగొట్టడానికి కాదు..
# హైదరాబాద్ నగరాన్ని నిర్మించడానికి: సీఎం రేవంత్







- హైడ్రా అంటే కూల్చివేయడానికి కాదని, నగరాన్ని నిర్మించడానికి ఏర్పాటు చేసిన సంస్థ అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.
- హైడ్రాలో విపత్తు నిర్వహణ, ఆస్తి రక్షణ దళాలు ఉన్నాయి.
- 12 మంది ఎస్సైలు, 30 మంది కానిస్టేబుల్స్‌తో హైడ్రా పనిచేస్తుంది.
- హైడ్రా వర్షాలు వస్తే ప్రజలను కాపాడుతుంది, విపత్తులు వస్తే అండగా ఉంటుంది.
- నగరంలో 940 చెరువులకు గాను 420 కబ్జాకు గురయ్యాయని, నాలాలు మూసుకుపోయాయని సీఎం తెలిపారు.
- ట్రాఫిక్ జామ్‌కు నాలాల ఆక్రమణలే ప్రధాన కారణం.

తరువాయి పేజి 2లో

# పునర్విభజన చట్టంలో అమరావతి పేరు..
# ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం



అమరావతి: పునర్విభజన చట్టంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని స్థానంలో అమరావతి పేరు చేర్చే ప్రతిపాదనకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి పేరును పునర్విభజన చట్టంలో చేర్చేలా చట్ట సవరణ చేయాలని క్యాబినెట్ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపించనున్నారు. అలాగే, ఈ భేటీలో అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీకి క్యాబినెట్ ధన్యవాదాలు తెలిపింది. 47వ సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాజధాని పరిధిలో వివిధ సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమ కార్యక్రమాలపై చర్చించింది. తీరప్రాంత భద్రత, రక్షణ రంగ పరిశ్రమల వద్ద జాగ్రత్తలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించింది. ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన త్రివిధ దళాలకు

**సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. ఈ భేటీలో అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీకి క్యాబినెట్ ధన్యవాదాలు తెలిపింది.**

2లో

- మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో అందించే ఆర్థిక సహాయాన్ని పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.
- రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి కోసం మెగా ఈవెంట్స్ నిర్వహించే ప్రతిపాదనకు అంగీకారం తెలిపారు.
- మున్సిపల్ శాఖకు సంబంధించిన 281 పనులను హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపట్టేందుకు ఆమోదం లభించింది.

## ఎల్‌జీకి స్వాగతం.. సీఎం చంద్రబాబు ట్వీట్

2లో

## సరిహద్దులో ఉద్రిక్తతల వేళ.
### హఠాత్తుగా న్యూఢిల్లీకి సౌదీ మంత్రి..



భారత్-పాక్ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకొన్న వేళ.. సౌదీ అరేబియాకు చెందిన ఓ జూనియర్ మంత్రి హఠాత్తుగా న్యూఢిల్లీకి వచ్చారు. ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ జూనియర్ మంత్రి అదెల్ అల్‌జుబైర్ నేడు ఢిల్లీకి వచ్చారు. ఆయన మన విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో చర్చలు జరిపారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలను చల్లార్చే చర్యల్లో భాగంగా ఈ పర్యటన చేపట్టినట్లు తెలుస్తోంది. దీనిపై విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఎక్స్‌వేదికగా పోస్టు చేశారు. తరువాయి పేజి 2లో

## 'ఆపరేషన్ సిందూర్'పై దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు

ఆపరేషన్ సిందూర్ పై దుష్ప్రచారం చేసే వారికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరించింది.



# సంపాదకీయం

## సుప్రీం అంతిమ అస్త్రం ఆర్టికల్ 142




సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 అనే మూడో కన్నును తరచూ తెరవవలసి వస్తున్నది. ప్రధానంగా పాలకులు, రాజకీయ నాయకుల స్వార్థ క్రీడ నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడటం కోసం దాని వినియోగించక తప్పడం లేదు. 2024 ఫిబ్రవరిలో చండీగఢ్ మేయర్ ఎన్నిక ఫలితాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఫలితంలో ఓడిపోయినట్టు ప్రకటించిన ఆప్ అభ్యర్థిని మేయర్ పదవికి ఎన్నికైనట్టు నిర్ధారించింది. అప్పుడు సుప్రీంకోర్టు ఇదే రాజ్యాంగ అధికరణను ప్రయోగించింది. మేయర్ ఎన్నికల నిర్వహణాధికారి అయిన బీజేపీ నాయకుడు అనిల్ మాసి తమ పార్టీకి అనుకూల పరిస్థితులు వచ్చేవరకు పోలింగ్ తేదీని వాయిదా వేస్తూ వచ్చారు. చివరికి కోర్టు జోక్యంతో 2024 జనవరి 30న జరిగిన ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థి ఒకవైపు, బీజేపీ అభ్యర్థి మరోవైపు బరిలో మిగిలారు. మొత్తం 36 మంది కౌన్సిలర్లలో 20 మంది ఆప్ అభ్యర్థికి, 16 మంది బీజేపీ అభ్యర్థికి ఓటు వేశారు. కానీ నిర్వహణాధికారి అనిల్ మాసి బీజేపీ అభ్యర్థి గెలిచినట్టు ప్రకటించారు. ఆప్ అభ్యర్థికి స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ అతనికి పడిన ఓట్లలో ఎనిమిదింటిని చెల్లనివిగా చేసి బీజేపీ అభ్యర్థి గెలిచినట్టు ప్రకటించారు. ఇందుకోసం ఆ ఎనిమిది బ్యాలెట్ పత్రాలను తానే స్వయంగా పాడుచేసి వాటిని చెల్లని ఓట్లుగా ప్రకటించారు. ఆ విధంగా మెజారిటీ ఓటర్ల అభీష్టాన్ని కాలరాశారు. ఈ మోసాన్ని గమనించిన సుప్రీం కోర్టు ఆర్టికల్ 142 ద్వారా తనకు సంక్రమించిన విశేష అధికారాలను వినియోగించి బీజేపీ అభ్యర్థి ఎన్నికను రద్దు చేసింది. ఆప్ అభ్యర్థి గెలిచినట్టు తానే ప్రకటించింది.

తమిళనాడు గవర్నర్ దీర్ఘ కాలంగా తన వద్ద ఉంచుకొని బూజు పట్టించిన బిల్లులకు పచ్చ జెండా ఊపిన తాజా తీర్పును కూడా సుప్రీంకోర్టు 142వ అధికరణ నుంచి తనకు సంక్రమించిన ఎదురులేని అధికారాలతోనే ఇచ్చింది. పెండింగ్‌లోని 10 తమిళనాడు బిల్లులూ ఆమోదం పొందినట్టు తానే ప్రకటించింది. న్యాయమూర్తులు జె.బి.పార్థివాలా, ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈ తీర్పును ప్రకటించింది. రాష్ట్రపతిని సైతం నియమబద్ధం చేయడం ఈ తీర్పులోని విశేషం. తిప్పి పంపిన బిల్లులను శాసనసభ మళ్ళీ ఆమోదించి పంపితే చెప్పుకోదగిన మార్పులుంటే తప్ప వాటిపై గవర్నర్ ఆమోద ముద్ర వేసి తీరవలసిందే అని ధర్మాసనం స్పష్టం చేసింది. గవర్నర్లు తన పరిశీలనకు పంపిన బిల్లులను రాష్ట్రపతి మూడు మాసాలకు మించి తన వద్ద ఉంచుకోరాదనీ చెప్పింది. గవర్నర్లు తనకు పంపే బిల్లులను ముఖ్యంగా వాటి రాజ్యాంగబద్ధత మీద వారు ఆందోళన వ్యక్తం చేసినప్పుడు రాష్ట్రపతి వాటిని సుప్రీంకోర్టు అభిప్రాయానికి పంపవచ్చునని మహోన్నత న్యాయ స్థానం సూచించింది. రాష్ట్రపతికే గీత గీసిన ఈ తీర్పు సహజంగానే పాలక బీజేపీ అసంతృప్తికి, ఆగ్రహానికి కారణమైంది. ఆర్టికల్ 142 ప్రజాస్వామ్య శక్తుల మీద ప్రయోగానికి సుప్రీంకోర్టు చేతిలో 24 గంటలూ అమరిన అణు క్షిపణి అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ విరుచుకుపడ్డారు. ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం రాష్ట్రపతినే ఆదేశించడమేమిటని హూంకరించారు. తమిళనాడు బిల్లులపై తీర్పు సందర్భంగా, వక్ఫ్ చట్టంలోని కొన్ని అంశాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసి, వాటిని నిలిపివేస్తామని చెప్పిన విషయంలోనూ బీజేపీ నేతలు అసహనాన్ని వెళ్ళగక్కుతున్నారు. శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల పరిధుల్లో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటున్నదనే నింద దూసుకొచ్చింది.

సుప్రీంకోర్టు తన ముందుకు వచ్చిన కేసులో పరిపూర్ణమైన న్యాయం చేయడం కోసం 142 ఆర్టికల్ దానికి విశేష అధికారాలను కట్టబెట్టింది. అమలులో ఉన్న ఎటువంటి నియమాలను, పద్ధతులనైనా పక్కనబెట్టి నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను ఇచ్చింది. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో సుప్రీంకోర్టు 142 ద్వారా బలంగా కాలు మోపి ఉండకపోతే ప్రజాస్వామ్యానికి ఎంత అన్యాయం జరిగి ఉండేదో! ఆ వ్యవహారంలో బీజేపీ పరీక్షల్లో కాపీ కొట్టి దొరికిపోయిన బడుద్దాయి విద్యార్థిలా వ్యవహరించింది. ప్రజాస్వామ్య మూల స్తంభాన్ని పెరికివేసింది. ఆర్టికల్ 142 సకాలంలో కలుగజేసుకొని దానిని సరిజేసింది.

ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు ఆయా రాష్ట్రాల్లో ప్రజల తీర్పును అమలు కానీయకుండా సైంధవ పాత్ర పోషిస్తున్నారు. అక్కడి ప్రజల సంస్కృతులను విశ్వాసాలను అవహేళన చేస్తున్నారు. బిల్లులను సంవత్సరాల తరబడి ఆపి ఉంచడం ద్వారా రాజ్‌భవన్ పాలనను నడిపిస్తున్నారు. వాటిని అకారణంగా రాష్ట్రపతి పరిశీలనకు పంపడం ద్వారా దీర్ఘనిద్రలోకి నెట్టివేస్తున్నారు. ప్రజాస్వామ్యం గురించి దిక్కులు పిక్కటిల్లే స్వరంతో గొంతు చించుకునే కేంద్ర పాలకులు ఉపరాష్ట్రపతిని, తమ ఎంపీలను ప్రజాస్వామ్యం మీదికి ఉసిగొల్పుతున్నారే గాని గవర్నర్లను దారిలో పెట్టడం లేదు. అందుచేతనే సుప్రీంకోర్టు తరచూ 142 కత్తిని ఒరలోంచి తీసి ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసి వస్తున్నది. ఈ ఆర్టికల్‌ను అణు క్షిపణితో పోల్చాడంటే ఉపరాష్ట్రపతి ఎంత ప్రజాస్వామ్య వ్యతిరేకో అర్థం చేసుకోవచ్చు.

ఆర్టికల్ 142 మొదట్లో 118 అధికరణగా అవతరించింది. దీనిని 1949 మే 27న రాజ్యాంగ సభ ఆమోదించింది. వాస్తవానికి ఈ అధికరణను ఆ రోజున రాజ్యాంగ సభలో చర్చకు పెట్టారు. కానీ ఆ సభ దానిపై చర్చ చేపట్టకుండా నేరుగా ఆమోద ముద్ర వేసింది. పరిపూర్ణ న్యాయం చేయడం కోసం సుప్రీంకోర్టుకు ఈ ఆర్టికల్ ద్వారా తిరుగులేని అధికారాలు కట్టబెట్టడం అవసరమేనని భావించి రాజ్యాంగ సభ ఎటువంటి చర్చ చేపట్టకుండా దానిని ఆమోదించిందని స్పష్టపడుతున్నది. అమల్లో గల చట్టాలు మౌనంగా ఉన్నచోట తగిన న్యాయం జరిగేలా చూడ్డానికి ఈ ఆర్టికల్ రూపుదాల్చింది. ప్రత్యేక సందర్భాల్లో ఎటువంటి నియమపాలనతో నిమిత్తం లేకుండా నేరుగా విడాకులు మంజూరు చేసే అధికారాన్ని ఆర్టికల్ 142 సుప్రీంకోర్టుకు కట్టబెడుతుంది. ఆ దంపతులను తిరిగి కలిపి ఉంచడం ఎంతమాత్రం సాధ్యం కాని పని అని సుప్రీంకోర్టు సంతృప్తి చెందితే 6%-%18 నెలల కాలం వేచి చూడవలసిన అవసరం కూడా లేకుండా ఈ అధికరణ కింద నేరుగా విడాకుల ఉత్తర్వులు జారీ చేయవచ్చు. సకాలంలో ఫీజు కట్టలేక ప్రవేశ అర్హత కోల్పోయిన ఒక దళిత విద్యార్థిని ధన్బాద్ ఐఐటీలో చేర్పిస్తూ 2024 అక్టోబర్‌లో సుప్రీంకోర్టు ఆర్టికల్ 142ని ఉపయోగించింది. గతంలో భోపాల్ గ్యాస్ లీకేజీ ఘోర విషాదం కేసు అమలులో గల చట్ట పరిధి దాటి బాధితులకు అధిక పరిహారం చెల్లించేలా యూనియన్ కార్బైడ్ యాజమాన్యాన్ని ఆదేశించడానికి సుప్రీంకోర్టు 142నే ప్రయోగించింది. అయోధ్య వివాదం పరిష్కారంలోనూ, జాతీయ రహదారులకు 500 మీటర్ల లోపు మద్యం దుకాణాలు ఉండరాదని ఇచ్చిన తీర్పులోనూ, పని స్థలాల్లో లైంగిక వేధింపుల నిరోధానికి మార్గదర్శకాలు రూపొందించిన సందర్భంలోనూ... ఇంకా అనేక కేసుల్లో ఈ ఆర్టికల్ ఉపయోగపడింది. ప్రభుత్వాలు గాని, సంస్థలు గాని రాజ్యాంగాన్ని కాదని ఇష్టానుసారంగా వ్యవహరించడానికి సాహసించినప్పుడు ఆర్టికల్ 142కి పని చెప్పక తప్పని పరిస్థితి సుప్రీంకోర్టుకు కలుగుతున్నది. అంతేకాదు, రాజ్యాంగ మౌలిక నిర్మాణం సిద్ధాంతం పార్లమెంటు కంటే సుప్రీంకోర్టును ఉన్నతమైనది చేస్తున్నది.

కేశవానంద భారతి, కేరళ ప్రభుత్వం కేసులో 7:6 మెజారిటీ తీర్పు ద్వారా అత్యున్నత న్యాయస్థానం రాజ్యాంగ మౌలికత సిద్ధాంతాన్ని స్థిరపరచింది. కొన్ని రాజ్యాంగ మౌలిక లక్షణాలను రాజ్యాంగ సవరణల ద్వారానైనా మార్చే హక్కు ఉండదని స్పష్టం చేసింది. పార్లమెంటు చేసిన అటువంటి రాజ్యాంగ సవరణలను సుప్రీంకోర్టు రద్దు చేసిన సందర్భాలు ఉన్నాయి. రాజ్యాంగానికి గల సర్వోత్కృష్టత, చట్టబద్ధ పాలన, ఫెడరలిజం, సెక్యులరిజం, న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం, ప్రాథమిక హక్కులు వంటివి కొన్ని రాజ్యాంగ మౌలిక లక్షణాల కిందికి వస్తాయి. అందుచేత న్యాయవ్యవస్థ కంటే పార్లమెంటే గొప్పది, ఆర్టికల్ 142 అక్రమమైనది అనే వాదనలతో ఎంతమంది ధన్‌ఖడ్‌లు గింజుకున్నా ప్రయోజనం ఉండదు. అయితే అధికార పార్టీకి చెందిన ఇటువంటి ఉత్సవ విగ్రహాలు చీటికి మాటికి న్యాయ వ్యవస్థపై దాడికి సమకట్టడం, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు

## హైడ్రా అంటే కూలగొట్టడానికి కాదు..
## హైదరాబాద్ నగరాన్ని నిర్మించడానికి: సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

హైడ్రా అంటే పేదల ఇళ్లను కూలగొట్టడానికి ఏర్పాటు చేశారని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కానీ హైడ్రా అంటే కూలగొట్టడానికే కాదు.. హైదరాబాద్ నగరాన్ని నిర్మించడానికి ఏర్పాటు చేసిన సంస్థ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొందరు కడుపు మంటతో హైడ్రా గురించి దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. మూసీని ఆక్రమించిన వారికీ, నాళాలు, చెరువులను కబ్జాలు చేసిన వారికే హైడ్రా అంటే భయం అని అన్నారు. గురువారం హైదరాబాద్ లోని బుద్ధభవన్ దగ్గర నిర్మించిన హైడ్రా పోలీస్ స్టేషన్ తో పాటు హైడ్రా వెబ్ సైట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం చేసిన కీలక వ్యాఖ్యలు:

హైడ్రాలో డిజాస్టర్ మేనేజ్మెంట్, అసెట్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఉన్నాయి
12 మంది ఎస్సైలు, 30 మంది కానిస్టేబుల్స్ ఉన్నారు
హైడ్రా వర్షాలు వస్తే ప్రజలను కాపాడుతారు..
విపత్తులు వస్తే అండగా ఉంటారు
హైడ్రా టీమ్.. చెట్లు కూలితే తొలగిస్తున్నారు.. కరెంటు పునరుద్ధరిస్తున్నారు
వరదల్లో ప్రజలను ఎలా కాపాడాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు
కోటి 20 లక్షల మంది నగర వాసులు ఉన్నారు.
940 చెరువులకు 420 కబ్జాలకు గురయ్యాయి.. నాలాలు మూసుకుపోయాయి
ట్రాఫిక్ జాం కు కారణం.. ఆక్రమణ కాదా.. నాలాలు ఆక్రమించినందుకే కదా ట్రాఫిక్ జామ్
గండిపేట్, ఉస్మాన్ సాగర్ లలో డైరెక్ట్ గా నిర్మాలు చేపడుతున్నారు.
ఫామ్ హౌజ్ ల మురికి నీటిని జలాశయాలలోకి పంపిస్తున్నారు
పరిస్థితి ఇలాగే ఉంటే హైదరాబాద్ ప్రజలకు తాగు నీరు ఎలా అందించాలి
చెరువుల కబ్జా చేసి నిర్మాణాలు కట్టడం వలన నీళ్లు ఇండ్లల్లోకి వస్తున్నాయి
అందుకే పేదలను కాపాడేందుకే.. హైట్రా ఏర్పాటు చేశాం
బతుకమ్మ పండుగ బతుకమ్మ కుంటలోనే నిర్వహించాలని నిర్ణయించాం
గొప్ప వ్యక్తులు గా చెప్పుకునేవారు చెరువులను కబ్జా చేశారు
అలాంటి వారిపై చర్యలు తీసుకుని చెరువులను కాపాడటం తప్పా
ఎవరైతే మూసీ ఆక్రమణలను ప్రోత్సహించారో, నాలాలను ఆక్రమించారో, అక్రమ నిర్మాణాలను చేపట్టారో వారికే.. హైడ్రా అంటే భయం..
ఈ నగరాన్ని ఇలాగే వ దిలేద్దామా.?
కొందరు కడుపు మంటతో తమను వ్యతిరేకించినా దూషించినా పట్టించుకోవడం లేదు
మూసీని కబ్జా చేసిన పెద్ద వాళ్లను తొలగించి పేదలకు డబుల్ బెడ్ రూమ్స్ ఇస్తున్నాం.
ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ.. కాపాడుకోవాలి:
1908లో ఆనాడు వచ్చిన వర్షాలు నిజాం సర్కార్ ను కదిలించింది..
వరదలనుంచి మానవాలిని కాపాడేందుకు ఒక గొప్ప ఆలోచనతో మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన కట్టడాలే మూసీ నదీ, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్..
మూసీ, ఈసా నదులను ఒడిసిపట్టి నీటిని నిల్వ ఉంచేందుకు ఈ జలాశయాలను నిర్మించారు.
శతాబ్దం కింద కట్టిన జంట జలాశయాలు ఇప్పటికీ మనకు నీరు అందిస్తున్నాయి.
ఇంత పెద్ద జలాశయాలను కబ్జా చేశారు.
అక్కడ ఫామ్ హౌజ్ లు ఏర్పాటు చేసుకుని మురుగునీరును వదులుతున్నారు
ఆ నీటిని మనం తాగాలా..? వారిపై చర్యలు తీసుకోకూడదా..?
చెరువులు మనకు పూర్వీకులు ఇచ్చిన ఆస్తి.. కనుమరుగైతే మనుగడ కష్టం
కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది
ఫ్యూచర్ సిటీలు, హైటెక్ సిటీలు కట్టుకుని ఓల్డ్ సిటీని మరిచిపోతున్నాం
ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ.. కాపాడుకోవాలని నిర్ణయించుకున్నాం
మెట్రో పాలిటన్ సిటీలు నివాస యోగ్యంగా లేవు:
బెంగళూర్ లో బోర్లు పడే పరిస్థితి లేదు.. పెద్ద పెద్ద సంస్థలు వలసలు వెళ్లే పరిస్థితి
తాగడానికి విలవిలలాడి ప్రజలు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడింది
ముంబై, చెన్నైలలో వరదలు వస్తే నగరాలు మునిగిపోయే పరిస్థితి
ఢిల్లీ కాలుష్యంతో ప్రభుత్వ సంస్థలకే సెలవులు ఇచ్చే పరిస్థితి
ఇదంతా మానవ తప్పిదం..
మెట్రో పాలిటన్ సిటీలు నివాస యోగ్యం కాని నగరాలుగా మారుతున్నాయి
ఈ ఉపద్రవం నుంచి గుణపాఠం నేర్చుకోకుంటే హైదరాబాద్ కూడా వాటి సరసన చేరే పరిస్థితి ఉంది
అందుకే ఎవరెన్ని విమర్శలు చేసినా.. ఎంత దుష్ప్రచారం చేసినా కాపాడాలని నిర్ణయించుకున్నాం.

## సరిహద్దులో ఉద్రిక్తతల వేళ..
## హఠాత్తుగా న్యూఢిల్లీకి సౌదీ మంత్రి..!

మొదటిపేజీ తరువాయి

"సౌదీ అరేబియా మంత్రి అదెన్ అల్ జుబైర్‌తో సమావేశం జరిగింది. ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో భారత్ దృక్కోణాన్ని ఆయనకు వివరించాను" అని జైశంకర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్-పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా సౌదీ మంత్రితో భేటీ జరిగింది. ఆ తర్వాత ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చితో మన విదేశాంగ మంత్రి భేటీ అయ్యారు. ఇప్పటికే భారత్-పాక్‌ల మధ్య రాజీ కుదిర్చేందుకు తాము సిద్ధమని ఇరాన్ వెల్లడించింది. ఇటీవల ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ.. "సోదరుల్లాంటి పొరుగుదేశాలే మాకు అత్యున్నత ప్రాధాన్యం" అని పేర్కొన్నారు. అంతేకాదు.. భారత్, పాక్‌లోని తమ దౌత్యకార్యాలయాల సహకారంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గిస్తామని పేర్కొన్నారు. పాకిస్థాన్‌ను కూడా అరాగ్చి ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే సందర్శించారు. అక్కడి నాయకులతో చర్చించి.. తిరిగి ఇరాన్‌కు వెళ్లారు. ఆ తర్వాత న్యూఢిల్లీకి వచ్చారు.

## 'ఆపరేషన్ సిందూర్'పై
## దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పై దుష్ప్రచారం చేసే వారికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరించింది. ఆపరేషన్ సిందూర్‌పై నకిలీ వార్తలు, తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసినా.. పోస్టులు పెట్టినా చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. సోషల్ మీడియాను నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. అలాంటి సందేశాలు షేర్ చేసిన వారి వివరాలను 8712672222 నంబర్ వాట్సప్ ద్వారా పంపించవచ్చని సూచించింది.

## సమస్యల విషయంలో మేం గిరిగీసుకోలేదు: హైడ్రా కమిషనర్ రంగనాథ్

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంగనాథ్ మాట్లాడుతూ.. "ఫలానా సమస్య మా పరిధిలోకి రాదు అని మేం గిరిగీసుకోలేదు. ఏ శాఖకు చెందిన విధి అయినా.. ముందుగా ఆ పనిని మేం పూర్తి చేస్తున్నాం. హైడ్రా వల్ల చెరువులు, నాలాల కబ్జాలు తగ్గిపోతున్నాయి" అని పేర్కొంటూ హైడ్రా చేస్తున్న పలు కార్యక్రమాలను రంగనాథ్ వివరించారు.

## పునర్విభజన చట్టంలో అమరావతి పేరు..
## ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

ఆపరేషన్ సిందూర్ అనే పేరు బాగుందని, దేశ ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబించేలా ఈ పేరు ఉందని క్యాబినెట్ అభిప్రాయపడింది. ఇదే తరహాలో రాష్ట్రంలోని పలు సంక్షేమ పథకాలకు మంచి పేర్లు పెట్టేలా దృష్టిపెట్టాలని నిర్ణయించింది. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణానికి సంబంధించి సుదీర్ఘంగా చర్చించారు. విశాఖ, మచిలీపట్నం, నాగాయలంకలలో వంటి ప్రదేశాల్లో భద్రత, కార్యాచరణపై మంత్రులతో సీఎం సుదీర్ఘంగా చర్చించారు. తీర ప్రాంతాల్లో భద్రతకు సంబంధించి జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సీఎం సూచించారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం పెంపు, రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి మెగా ఈవెంట్స్ నిర్వహించే ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది. మున్సిపల్ శాఖ 281 పనులను హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. వైకాపా హయాంలో ఆమోదించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న 3 చట్టసవరణ బిల్లులను వెనక్కి తీసుకోవాని క్యాబినెట్‌లో నిర్ణయించారు.

## ఎల్‌జీకి స్వాగతం..
## సీఎం చంద్రబాబు ట్వీట్

మొదటిపేజీ తరువాయి

అమరావతి: ఏపీలో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ కొత్త తయారీ యూనిట్ ఏర్పాటుపై సీఎం చంద్రబాబు హర్షం ప్రకటించారు. ఎల్‌జీకి ఆంధ్రప్రదేశ్ ఆహ్వానం పలుకుతోందంటూ ట్వీట్ చేశారు. శ్రీసిటీలో రూ.5,800కోట్లకు పైగా పెట్టుబడులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,500పైగా ఉద్యోగాలతో ఈ సంస్థ ఏపీని ప్రపంచ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఒప్పందం చేసుకుందన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక కమిటీ కింద ఈ సంస్థ 100శాతం ప్రోత్సాహకాలు పొందిందని సీఎం తెలిపారు. ఇది మన రాష్ట్రంలోని పారిశ్రామిక వృద్ధికి ఒక ఉత్తేజకరమైన కొత్త అధ్యాయానికి నాంది పలికిందని పేర్కొంటూ శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్‌కు మంత్రి నారా లోకేశ్ నేడు శంకుస్థాపన చేసిన అనంతరం దిగిన ఫొటోను సీఎం షేర్ చేశారు.

## శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్‌క్ శంకుస్థాపన




ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా శ్రీసిటీ- యూనిట్‌లో ఎల్జీ ఆవిష్కృతమైంది. పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపాయాలు, ఏపీ భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడంతో పాటు- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నామని లోకేశ్ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ ఇగురువారం పర్యటించారు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. రూ. 839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కంపెనీకి భూమి పూజ చేయడంతో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకునే దిశగా రాష్ట్రంలో మరో అడుగు పడింది. రూ. 5,001 కోట్ల పెట్టుబడిలో భాగంగా 2 వేల ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు. ఎల్జీ తమ సంస్థలు ఏర్పాటు- చేయడంతో ఇక్కడ ఎల్జీ సిటీ- ఏర్పడనుందని లోకేశ్ అన్నారు. విదేశీ సంస్థల ప్రతినిధుల రాకపోకలకు రాబోయే నాలుగు సంవత్సరాల్లో తిరుపతికి అంతర్జాతీయ విమానయానం పెరిగేలా చేస్తామని చెప్పారు. పరిశ్రమలు తీసుకు రావటానికి మంత్రులు, కలెక్టర్లు మాత్రమే కాదని..ప్రతి నియోజక వర్గం మరో నియోజక వర్గంతో పోటీ- పడాలని అన్నారు. పరిశ్రమల ఏర్పాటు-కు అన్ని రకాలుగా తోడ్పాటు- అందిస్తామని తెలిపారు. ఎల్జీ సంస్థ రూ.5000 కోట్లతో ఏర్పాటు- చేస్తున్న పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులు పెట్టే నమ్మకాన్ని తెచ్చిందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటిస్తున్న నేపథ్యంలో ముందస్తు అనుమతితో కేబినెట్‌కు రావడం లేదని సమాచారం ఇచ్చారు. శుక్రవారం సత్య సాయి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు కేబినెట్ సమావేశానికి మరో మంత్రి పయ్యావుల కేశవ్ హాజరు కాలేదు. విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా కేబినెట్ భేట-కి మరో మంత్రి సత్య
కుమార్ యాదవ్ హాజరుకాలేదు. ఈ మేరకు మంత్రులు ముందస్తు అనుమతి పొందారు.

## ఏపీ మద్యం కుంభకోణం కేసు
## వివరాలివ్వండి: సిట్‌కు ఈడీ లేఖ




అమరావతి: ఏపీ మద్యం కుంభకోణం కేసును దర్యాప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ సిద్ధమవుతోంది. వేల కోట్ల రూపాయలు అక్రమ మార్గంలో తరలించారనే ఆరోపణలు రావడంతో ఈడీ రంగ ప్రవేశం చేసేందుకు చర్యలు చేపట్టింది. మద్యం కేసుకు సంబంధించిన వివరాలను తమకు అందజేయాలని సిట్ చీఫ్, విజయవాడ నగర పోలీస్ కమిషనర్‌కు ఈడీ లేఖ రాసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం- 2002 ప్రకారం కేసు దర్యాప్తు చేస్తామని ఈడీ లేఖలో పేర్కొంది.

మద్యం కుంభకోణంపై సీఐడి అధికారులు నమోదు చేసిన 21/2024 ఎఫ్‌ఐఆర్‌కి సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఈడీ కోరింది. సీఐడి నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ సర్టిఫైడ్ కాపీ ఇవ్వాలని లేఖలో తెలిపింది. ఈ కేసుతో సంబంధం ఉందని ఇప్పటివరకు దర్యాప్తు అధికారులు గుర్తించిన వారి బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలు అందజేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోరింది. ఇప్పటివరకు ఈ కేసులో అరెస్ట్ చేసిన నిందితుల వివరాలు, రిమాండ్ రిపోర్టులు తమకు అందజేయాలని కోరింది. ఈ కేసులో అరెస్టయిన నిందితులపై అభియోగపత్రం నమోదు చేస్తే వాటి కాపీలను సైతం ఇవ్వాలని లేఖలో కోరింది.

# రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు:- పోత్నక్

**జన సముద్రం న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా**
తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మరియు రవాణా శాఖ మాత్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారి జన్మదిన సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ గారి ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న నిర్మించిన ఎల్లమ్మ దేవాలయంలో శ్రీ పొన్నం ప్రభాకర్ గారికి పూలమాల శాలువాలతో సత్కరించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈసందర్భంగా పిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఐ మిస్ యు ఐ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుని నుండి మార్క్ఫెడ్ చైర్మన్ గా,కరీంనగర్ పార్లమెంటు సభ్యునిగా అంచెలంచలు ఎదుగుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతిష్టాపకమైన బీసీ సంక్షేమ శాఖ



మరియు రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజులలో రాష్ట్రమంతటా ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ఘనత శ్రీ పొన్నం ప్రభాకర్ గారికి దక్కుతుందని అన్నారు ఎంత ఎత్తు ఎదిగిన సామాన్య కార్యకర్తలను సామాన్య ప్రజలను అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై ఎవ్వరు వచ్చిన తక్షణమే స్పందిస్తూ ప్రజా సమస్యలు పరిష్కారమే దిశగా పనిచేస్తున్న నాయకుడు రాష్ట్ర రోడ్డు రవాణా శాఖలను లాభాలలో బాటలోకి తీసుకువచ్చి ఆర్టీసీ కార్మికుల సమస్యల పట్ల నిరంతరం శ్రద్ధ వహిస్తూ వారి సమస్యలు పరిష్కార దిశగా అడుగులు వేస్తున్న శ్రీ పొన్నం ప్రభాకర్ గారికి రానున్న రోజుల్లో ఉన్నత స్థాయిలోకి ఎదగాలని మరిన్ని సేవలు ప్రజలకు చేయాలని శ్రీ లక్ష్మీనరసింహస్వామి శ్రీ స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామి ప్రసాదాలు అందించి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాచమల్ల రమేష్ మాజీ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పడిగెల ప్రదీప్ పట్నం ప్రణయ్ దాసరి మధు తదితరులు పాల్గొన్నారు.

## రాసాల యాదయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి



**జన సముద్రం న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా**
భువనగిరి మండలంలోని తుక్కాపురం గ్రామం లో బి ఆర్ ఎస్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ రసాల యాదయ్య పరమపదించారు ఆయన పార్థీవ దేహనీ భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి పూల మాల వేసి అతని కుటుంబ సభ్యుల ను ఓదార్చారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, మరియు మాజీ ఎంపీపీ కేశపట్నం రమేష్, మజీ ఎంపీటీసీ రసాల మల్లేశం, మాజీ సర్పంచ్ నోముల మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లమసా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పుట్ట వీరేష్, బి ఆర్ ఎస్ నాయకులు జనగాం మహేష్, మాకొలు భాను, మాకొలు మధు, పొట్ట సైదులు, తదితరులు పాలుగోన్నారు.

## పలువురి శుభకార్యములకు హాజరైన గోలి ప్రణీత పింగల్ రెడ్డి







**యాదాద్రి భువనగిరి జిల్లా (మే.08)**
జనసముద్రం న్యూస్ బీబీనగర్ పట్టణ వాస్తవ్యులు ఆవుల రోజా - శ్రీనివాస్ దంపతుల కుమారుల నూతన వస్త్ర అలంకరణ వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించిన యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ శిశు సంక్షేమ శాఖ స్థాయి సంఘం చైర్మన్,బీబీనగర్ మండల మాజీ జెడ్పిటిసి గోలి ప్రణీత పింగల్ రెడ్డి.మరియు పేరబోయిన భారతమ్మ - దాసు యాదవ్ దంపతుల కూతురు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన గోలి ప్రణీత పింగల్ రెడ్డి.గుర్రాల దండి గ్రామ చంద్రబాను నాయక్ మనవరాలు వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన గోలి ప్రణీత పింగల్ రెడ్డి.ఈ కార్యక్రమంలో నాయకులు కాసుల రఘునందన్ గౌడ్,ఎండి మోయిన్,తుమ్మల నరసింహారెడ్డి,పొట్ట నవీన్ కుమార్,కాసుల అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షం కారణంగా ఇల్లు కూలిపోయిన గ్రామపంచాయతీ కార్మికురాలుకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి





● **అన్నంపట్ల మాజీ సర్పంచ్ బొక్క వసుమతి జైపాల్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి జిల్లా (మే.08)**
జనసముద్రం న్యూస్ బీబీనగర్ మండల పరిధిలోని అన్నంపట్ల గ్రామ నివాసి అయిన పారిశుద్ధ్య కార్మికురాలు పర్రె బొందమ్మ భర్త నరసింహ నిరుపేద కుటుంబం అయిన మొన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి కారణంగా ఇల్లు కూలి 6 మందికి తీవ్రంగా గాయాలయి భువనగిరి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.వారికి ఇందిరమ్మ ఇల్లు వెంటనే మంజూరు చేయాలి ఆర్థికంగా ఆదుకోవాలిని అన్నంపట్ల గ్రామ తాజా మాజా సర్పంచ్ బొక్క వసుమతి జైపాల్ రెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.అదేవిధంగా ఇంటి నిర్మాణానికి పూర్తిగా ఖర్చులు ఇవ్వాలని కోరారు.

## సేవాదళ్ వ్యవస్థాపకులు స్వాతంత్ర సమరయోధులు ఎన్.ఎస్ హార్డికర్ జయంతిని పురస్కరించుకుని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత లౌకిక వాదానికి పునరంకిత మౌదాం.....

● **బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్**

**జన సముద్రం న్యూస్ యాదాద్రి భువనగిరి జిల్లా**
స్వాతంత్ర సమరయోధులు, సేవాదళ్ వ్యవస్థాపకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ నారాయణ సుబ్బారావు ఎన్ఎస్ ఎంఎస్ ఆర్టికర్ గారి 136 వ జయంతి సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు యాదాద్రి జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో పండ్లు బ్రెడ్ పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ హార్డికర్ చరిత్రని తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీకి అడికర్ 19 23 లో కాకినాడ లో జరిగిన కాంగ్రెస్ సభలో సేవాదళాలని ఒక బోర్డుగా ఏర్పాటు చేసి 1924 జనవరి 1న సేవాదళాన్ని హిందుస్థాన్ సేవాదళ్గా స్థాపించడం జరిగింది. ఇట్టి కార్యాలయం కర్ణాటకలోని ధార్వాడలో ప్రధాన కార్యాలయం ఉండేది ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పర్యవేక్షణలో పనిచేసేది క్రమేనా 1929 ఆల్ ఇండియా వాలంటరీ బోర్డ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి బోర్డుకు అధ్యక్షులుగా సుభాష్ చంద్రబోస్ జనరల్ సెక్రెటరీగా ఎన్ఎస్ఆర్డికర్ బోర్డు మెంబర్లుగా మరియు పండిత్ జవహర్లాల్ నెహ్రూ అన్సారి యు రమణ రావు శివప్రసాద్ గుప్తా మొదలగు వారు పని చేసినారు తద్గాంతరం స్వాతంత్ర సమరంలో సేవాదళ్ క్రియాశీలంగా డాక్టర్ నారాయణ సుబ్బారావు గారు కర్ర సాము కత్తి సాము శారీరకంగా దృఢంగా తయారు చేయడం బలంగా ఉండడానికి అనేక అనేక వ్యాయామములు నేర్పించి బ్రిటిష్ నీ ఎదుర్కొనటంకు తరిమికొట్టంకు క్రియాశీలంగా సేవాదళాన్ని భారత దేశంలో ముందుకు తీసుకుపోవడాన్ని గుర్తు చేశారు మరియు మాజీ ప్రధానిపండిత్ జవహర్లాల్ నెహ్రూ గారు ఎన్ఎస్ఆర్డికర్ గుజరాత్ రాష్ట్రం నందు అలహాబాద్ క్యాంపు నందు శిక్షణ తీసుకున్నాడు అనేక కార్యక్రమంలో క్రియాశీలంగా క్యాంపులు ఏర్పాటు చేసి పార్టీ విధి విధానాలు క్రమశిక్షణ కార్యక్రమాలను



దృఢంగా తయారు చేయడంలో ఎన్ ఎస్ ఆర్ డి గారికి చాటిలేరు వారి గుర్తింపుని అప్పటి ప్రధానమంత్రి విపి సింగ్ 1989లో డిసెంబర్ 2న ఎస్13 టికెట్ పోస్టల్ ప్రకటించడం జరిగింది కావున రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ వెన్నుముక లాంటిది పార్టీని క్రమశిక్షణ రహితంగా భజతహితంగా కార్యక్రమాలని ముందుకు తీసుకోవడంలో క్రియాశీలంగా పార్టీకి పనిచేయాలని రాబోయే రోజుల్లో జిల్లా నందు గ్రామ స్థాయి వరకు సేవాదళ్లను విస్తరించాలని అని అన్నారు మరియు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువేసే విధానంలో ప్రతి ఇంటి కూడా రాష్ట్రం కాంగ్రెస్ పార్టీ విధివిధానాలని ప్రజలకు తెలియజేయుటలో ముందుండాలని అన్నారు రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యే వరకు విశ్రాంతి చెందుద్దని అని మాట్లాడారు మరియుకార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ జనరల్ సెక్రెటరీ పిట్టల బాలరాజ్ ఎన్ఎస్ హాడీకర్ సేవాదళ్ చేసిన సేవలు మరుపురానివని ఆయన అడుగుజాడలో మేము పని చేయడానికి సన్నాసిద్దులమని అన్నారు ఇట్టి కార్యక్రమంలో యాదాద్రి జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు సామల రవీందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాడూరు నరసింహ, మాజీ కౌన్సిలర్ ఈరపాక నరసింహ, ఎండి కౌసర్, డిసిసి జనరల్ సెక్రెటరీ యం డి మదర్, హీరేకారి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ దేవరకొండ నరసింహ చారి, మరుకుల శ్రీనివాస్, టౌన్ సేవాదళ్అధ్యక్షులు ప్రకాష్ దాకురి, కాంగ్రెస్ నాయకులు రమేష్, కాంగ్రెస్ నాయకులు ఎనగాండ్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పలు వివాహాది శుభకార్యాలలో పాల్గొన్న BSR దంపతులు



● **నూతన వధువరులను ఆశీర్వదించిన BSR దంపతులు**

**జనసముద్రం ప్రతినిధి తాండూర్(మే 8)**
తాండూర్ నియోజకవర్గ పరిదిలో GPR గార్డెన్ లో జరిగిన (దీపక్ రెడ్డి-బిందు) మరియు వీరశైవ కళ్యాణ మంటపంలో జరిగిన (భావన-వినయ్ కుమార్) వివాహది శుభకార్యాలలో పాల్గొని నూతన వధూవరులని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసినా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు RBOL CEO బుయ్యని శ్రీనివాస్ రెడ్డి దంపతులు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తధితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి పొన్నం పుట్టినరోజు వేడుకలు



**జనసముద్రం న్యూస్ కరీంనగర్ జిల్లా రిపోర్టర్ మే 8**
గురువారం రోజు ఉదయం హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి శ్రీ వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేత రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ %a% రావాణా శాఖా మంత్రి వర్యులు శ్రీ పోన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొల్లూరి కిరణ్ కుమార్ ,మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పుల్ల రాధ, హుజురాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మేకల తిరుపతి, హుజురాబాద్ పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు యేముల పుష్పలత, మార్కెట్ కమిటీ చైర్మన్ గుడూరి రాజేశ్వరి-స్వామి రెడ్డి ,హుజురాబాద్ హనుమాన్ టెంపుల్ చెర్మెన్ కొలిపాక శంకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొల్లు బాబు ,హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చల్లూరి రాహుల్, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జి మిడిదొడ్డి రాజు ,ఎస్సీ సెల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్ర రవీందర్ ,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి తరుణ్ ,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షురాలు గొస్కుల నాగమణి ,బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఆలేటి సుశీల ,మైనారిటీ నాయకులు యండి అఫ్సర్ ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నేరేళ్ళ మహేందర్ గౌడ్ నర్సింగ్ రాంశకర్ గౌడ్ ,యండి ఇమ్రాన్, మోరె తిరుపతి ,రాజ్ కుమార్ ,ఉమాపతి రావు ,కుమార్ ,సొల్లు సునిత, కదారి తిరుమల, అనిల్ ,వినోద్ ,గణేష్, ఎర్ర నాగరాజు ,కుంట నర్సింహారెడ్డి ,యండి రియాజ్ ,యండి సలీం, రాధ ,యండి కరీమా తదితరులు పాల్గొన్నడం జరిగింది

## మోడీ విధానాలను వ్యతిరేకించండి దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

● **సిఐటియు అధ్యక్షులు దాసరి పాండు**



**యాదాద్రి భువనగిరి జిల్లా (మే.08)**
జనసముద్రం న్యూస్ భూదాన్ పోచంపల్లి:- కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి అని సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పాండు అన్నారు.గురువారం రోజున పోచంపల్లి పట్టణ కేంద్రంలో సిఐటియు జనరల్ బాడీ సమావేశాము కామ్రేడ్ వద్దేపల్లి యాదగిరి అధ్యక్షతన సమావేశం నిర్వహించగా సమావేశానికి వారు ముఖ్య అతిథిగా దాసరి పాండు హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కోడులను బడా పెట్టుబడిదారుల కోసం తీసుకువచ్చారని పెట్టుబడిదారుల ఒత్తిడి వల్ల నేడు కార్మిక శ్రమను మొత్తం దోచి యజమానులకు బొజ్జలు నింపే విధంగా కోడ్లు చేశారని అన్నారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మికుల కు హక్కులను కాల రాయాలని ప్రయత్నిస్తే కార్మికు కర్షకులు ఏకమై ప్రభుత్వాన్ని గద్దె దింపుతాయని వారు హెచ్చరించారు.ఈరోజు కార్మికులకు యజమానులకు మధ్యన అనేక ఘర్షణలు చేసే విధంగా కోడుల్లో పేర్కొన్నారని ఇప్పటికే అనేక పోరాటాల సాధించుకున్నటువంటి సంక్షేమ బోర్డులను కోఢ్ పేరుతో రద్దుచేసి ఉన్న సంక్షేమ బోర్డులో ఆదాయాన్ని మొత్తం పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టడం కోసమే ప్రయత్నం చేస్తుందని వీటి వ్యతిరేకంగా కార్మికుల హక్కుల రక్షణ కోసం పని గంటల పెంపును నిరసిస్తూ ఈఎస్ఐ,పిఎఫ్ లాంటి సౌకర్యాలను కార్మికులకు వర్తింప చేసే విధంగా చట్టాలను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.కార్మికుల పని గంటల విషయంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకొని పనిగంటల విధానంలో మార్పులు చేయాలని చూస్తే ప్రభుత్వాలు మార్చే శక్తి కార్మికులకు ఉందని వారు ప్రభుత్వానికి గుర్తు చేశారు కార్మికులకు రక్షణ కోసం కోడుల రద్దు కోసం ఈనెల మే 20న దేశవ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు సమ్మెలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాల్సిందిగా వారు పిలుపునిచ్చారు.వీరితో పాటు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మంచాల మధు,వివిధ రంగాల నాయకులు దుబ్బాక జగన్, కవిత,మల్లయ్య,అనసూయ,బసవయ్య,కృష్ణారెడ్డి,రజినీకాంత్,బాలయ్య,చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ పోలీస్ విభాగాల అధ్వర్యంలో రోడ్డుపై గుంతలు పుడ్చే కార్యక్రమం

● **పెద్దేముల్ మండల్ తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్**

● **పెద్దెముల్ SI శ్రీధర్ రెడ్డి**



**జనసముద్రం ప్రతినిధి పెద్దెముల్ (మే8)**
పెద్దేముల్ మండల కేంద్రంలో గాజీపూర్ గ్రామం నుండి పెద్దేముల్ వరకు సంగారెడ్డి ప్రధాన రహదారి మార్గంలో ఏర్పడిన గుంతల వలన నిత్యం ప్రమాదాలు స%శ%బవిస్తున్నాయని వాహనదారులు ఇబ్బంది పడుతున్న విషయాన్నీ గమనించి రెవెన్యూ మరియు పోలీసు విభాగాల ఆద్వర్యంలో సంయుక్తంగా దాతల సహకారంతో రోడ్ పై ఎర్పడిన గుంతలను పుడ్చి వేయించడం జరిగిందని తెలిపారు.రోడ్లపై గుంతలను పుడ్చడం పట్ల పలువురు వాహనదారులు, ప్రయాణీకులు హర్షం వ్యక్తం చెసారు.

# మే 20 జాతీయ సమ్మెను జయప్రదం చేయండి.

**జనసముద్రం న్యూస్, జ్ఞానపురం, విశాఖ పట్టణం , మే 8**
మే 20 అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడ జోన్ కమిటీలు ప్రెస్ మీట్ మద్దిలపాలెం ఆఫీసులో ఉదయం 11 గంటలకి నిర్వహించడం జరిగింది. ఈ ప్రెస్ మీట్ లో సమ్మె పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పి వెంకట్రావు, డి అప్పలరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులకు నష్టమైన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికవర్గం పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలను కేంద్ర బీజేపీ మోడీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్ గా మార్చడాన్ని ఖండించారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ యజమానులకు, బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఈ లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్స్ అమలు అయితే కార్మిక వర్గం అనేక హక్కులను కోల్పోతుందని అన్నారు. తక్షణం 44 కార్మిక



చట్టాలు అమలు చేయాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల జీతాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచడం లేదని, ప్రస్తుతం ధరల ప్రకారం కనీస వేతనం 26,000 అమలు చేయాలని కోరారు. 33 మంది ప్రాణ త్యాగంతో విశాఖ స్టీల్ ప్లాంట్ ను సాధించుకున్నామని ఈ స్టీల్ ప్లాంట్ ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించరాదని డిమాండ్ చేశారు. బ్యాంకులు ఇన్సూరెన్స్ రంగం మిగిలిన ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తుందని తక్షణం ఈ ప్రైవేటీకరణ విధానాలు ఆపాలని, ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ కూడిన సమగ్ర చట్టం చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. విశాఖ జిల్లాలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో, సంఘటిత, అసంఘటిత రంగాల్లో మే 20 సమ్మెపై ప్రచారం విస్తృతంగా నిర్వహించాలని, సమ్మె నోటీసులు అందజేస్సిందన్నారు. ఈ సమ్మెలో విశాఖ జిల్లాలోని కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. మే 20 న సమ్మె పాటిస్తూ కార్మిక వర్గం మొత్తం రైల్వే డిఆర్ఎం ఆఫీస్ నుండి జీవీఎంసీ గాంధీ బొమ్మ వరకు ర్యాలీ సభ జరుగుతుందన్నారు. ఈ ప్రెస్ మీట్ లో సిఐటియు నాయకులు నరేంద్ర కుమార్, రాజ్ కుమార్, ఐసీ నాయుడు, ఏ సింహాచలం, లక్ష్మణరావు, వెంకటరమణ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నవోదయం కార్యక్రమంలో భాగంగా మాచర్ల ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిశీలన.



**పల్నాడు బ్యూరో జన సముద్రం న్యూస్, మే 8.**
ప్రభుత్వము నాటుసారాయి నిర్మూలన కొరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ కమిషనర్ గుంటూరు ఎమ్ రవికుమార్ రెడ్డి మరియు అసిస్టెంట్ ప్రొహిబిషన్ %ు% ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి సూర్యనారాయణ ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన మాచర్లలో ఆకస్మికంగా తనిఖీ చేసి నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఎడాప్షన్ ఆఫీసర్స్ తో ఇంట్రాక్ట్ అయ్యారు , రికార్డులు తనిఖీ చేశారు నవోదయ 2.0 భాగంగా వీలైనంత త్వరగా సారారహిత గ్రామంలుగా చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయి మరియు మండల స్థాయి కమిటీల ద్వారా గ్రామాల ఏ కేటగిరి లోని గ్రామాలు అన్నిటిని కూడా సారారహిత గ్రామాలుగా ప్రకటించుకోవాలని దుర్గి మాచర్ల వెల్దుర్తి మండలాలను ఈనెల చివరికల్లా సారారహిత మండలాలుగా ప్రకటించుకోనేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ న.వి.రమణ, ఎస్సై మరియి సిబ్బంది అందరూ పాల్గొన్నారు కావున మాచర్ల ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మీడియాకు తెలియపరచటమైనది.

### అపార్ట్ మెంట్ భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి





**జనసముద్రంన్యూస్, మే 8, మాచర్ల**
పల్నాడు జిల్లా మాచర్ల పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కంభంపాటి అనిల్ కుమార్ స్థానిక రింగ్ రోడ్డు సెంటర్ లోని రవితేజ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఎదురుగా నూతనంగా నిర్మించ తలపెట్టిన అపార్ట్ మెంట్ భూమి పూజా కార్యక్రమానికి మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే తో పాటు మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో మేము సైతం





- మాచర్లలో 200 ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్క్
- విజన్ 2047 లక్ష్యంగా అడుగులు
- 5 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి : ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

**జనసముద్రంన్యూస్, మే 8, మాచర్ల:**
ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు విజన్ %-% 2047 కల సాకారంకాబోతుందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం మాచర్ల రూరల్ మండలం, రాయవరం శివారులో ఉన్న ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన కార్పోరేషన్ ( ఏపీఐఐసీ ) భూముల్లో ఎంఎస్ఎంఈ ల ఏర్పాటుకు భూమి పూజా కార్యక్రమంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి ముఖ్య అతిథిగా పాల్గొని, వివిధ పనులకు శంకుస్థాపన చేశారు. దాదాపు 7 కోట్లతో మౌలిక వసతుల పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆయన అవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ఏపీని పారిశ్రామీక హబ్ గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు పాటుపడుతున్నారని వివరించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు సింగిల్ విండో సిస్టం తీసుకొచ్చి.., అనుమతులను సరళీకృతం చేశారని ఆయన చెప్పుకొచ్చారు. యువతకు 20 లక్షల ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని.., స్వయం ఉపాధి రంగాల్లో ఔత్సాహికులు శ్రద్ధ చూపాలని కోరారు. 2018లో నియోజకవర్గంలోని రాయవరం వద్ద 200 ఎకాలను పరిశ్రమల శాఖకు భూములు కేటాయిస్తే.., జగన్ రెడ్డి హయంలో పట్టించుకున్న దాఖలాలు లేవు అని వాపోయ్యారు. అలానే గతంలో రాజకీయ కల్మషంతో మాచర్లలో అరాచక పాలన రాజ్యమేలిందని.., అందుకే పరిశ్రమలు స్థాపించేందుక పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదని విచారం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించే లక్ష్యంగా మేము సైతం భాగస్వాములుగా ముందుకు అడుగులు వేస్తున్నామని ఆయన ఉద్ఘాటించారు.

**5 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి..!**
రాయవరం ఇండస్ట్రీయల్ పార్క్ లో పరిశ్రమలు నెలకొల్పేందుకు సంబంధించిన అనుమతుల ఆన్ లైన్ ద్వారా త్వరితగతిన పొందేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే జూలకంటి వెల్లడించారు. ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమలకు కావాల్సిన మౌలిక వసతుల కోసం ముందస్తుగా నిధులు రూ. 7 కోట్లు, తరువాత మరో 9 కోట్లను ప్రభుత్వం కేటాయింపులు చేసిందని ఆయన పేర్కొన్నారు. రోడ్లు, నీరు, విద్యుత్ వంటి మౌళిక వసతుల కల్పన పనులు శర వేగంగా జరిగేలా అన్నీ రకాల చర్యలు తీసుకుంటునట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు రిజిస్ట్రర్ అయ్యారని.., త్వరలో పరిశ్రమల స్థాపనకు అడుగులు పడనున్నాయని పేర్కొన్నారు. పారిశ్రామికవాడలో పెద్ద ఎత్తున పరిశ్రమలను స్థాపించి.., ప్రత్యక్షంగా 5 వేల మందికి, పరోక్షంగా మరో 3 వేల మందికి ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ డాక్టర్ ఎంఎల్ నరసింహారావు, ఏపీఐఐసీ డిప్యూటీ మేనేజర్లు మధు, కృష్ణమోహన్, తహశీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహ కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే జూలకంటి, టీడీపీ నాయకులు



**జనసముద్రంన్యూస్, మే 8, మాచర్ల**
పల్నాడు జిల్లా మాచర్ల పట్టణం లో జరిగిన వివాహ కార్యక్రమానికి హాజరైన మాచర్ల నియోజక వర్గ శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మరియు 2019 సంవత్సర ఎన్నికల్లో మాచర్ల నియోజక వర్గ టీడిపి ఇన్చార్జి గా పోటీచేసిన డా "అంజి రెడ్డి ని మాచర్ల పట్టణ టిడిపి అధ్యక్షుడు కొమెర దుర్గారావు ,మాచర్ల పట్టణ ప్రధాన కార్యదర్శి బండ్ల శ్రీనివాసరావు కలవడం జరిగింది.

### శ్రీ వాసవి అమ్మవారి జయంతి సందర్భంగా పులిహార, దద్దోజనం, పాయసం పంపిణీ కార్యక్రమం



**జనసముద్రంన్యూస్, మే 8, కారంపూడి**
పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం కారంపూడి పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో గల శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద శ్రీ వాసవి అమ్మవారి 4642వ జయంతి సందర్భంగా పులిహార, దద్దోజనం పాయసం పంపిణీ చేశారు. కార్యక్రమంనకు కరాలపాటి శ్రీనివాసరావు ధర్మపత్ని లీలావతి, అల్లుళ్ల కూతుళ్ల మద్దాల వినయ్ పృద్వి ధర్మపత్ని సిరి మాధురి, తాడేపల్లి సాయి కృష్ణ ధర్మపత్ని జాహ్నవి సహకారం అందించారు .ఈ నారాయణ సేవా కార్యక్రమంలో కరాలపాటి ప్రసాద్ బాబు ధర్మపత్ని లక్ష్మీ కుమారి, చిన్ని లక్ష్మి, యక్కల రమాదేవి, కందుకూరి దేవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణ

- ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్‌కు బీజేపీ నేతల సన్మానం



**కదిరి, జన సముద్రం న్యూస్, మే 08:-**
గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా అనేక మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారు.ఈ నేపథ్యంలో విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారులకు లోన్లు మంజూరు చేసినందుకు కదిరి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రమేష్ ని గురువారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ స్టేట్ కన్వీనర్ చింత శరత్ కుమార్ రెడ్డి,సీనియర్ నాయకులు ఇందుకూరు సురేందర్ రెడ్డి,సుబ్బరాజు,రామాంజనేయులు,పరమేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని సాంప్రదాయ వృత్తిదారులకు ఆర్థికంగా అండగా ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చింది.ప్లంబర్లు, కార్పెంటర్లు,బడుగు బలహీన వర్గాల వృత్తిదారులు ఈ పథకం ద్వారా మద్దతు పొందవచ్చు.అలాగే ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కూడా గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ కుటుంబాలకు విద్యుత్ భద్రతను అందిస్తోంది.ఈ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరుతున్నాం అన్నారు.

**విశ్వకర్మ యోజన ముఖ్యాంశాలు:-**
రీజనల్ పరిధిలోని సుమారు 57 బ్యాంకుల లో 1651 మందు లబ్ధిదారులకు విశ్వకర్మ యోజన ద్వారా లోన్లు ఇచ్చినట్లు తెలిపారు. సాంప్రదాయ వృత్తిదారులకు గుర్తింపు అవసరమైన పనిముట్లు కొనుగోలుకు ఆర్థిక సహాయం శిక్షణ మరియు మార్కెట్ లింకేజెస్ గౌరవవేతనం మరియు మైక్రో ఫైనాన్స్ సదుపాయాలు..ఈ పథకాలను గ్రామీణ బ్యాంకుల ద్వారా సులభంగా పొందవచ్చని,ప్రజలు వాటి గురించి తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నేతలు పిలుపు నిచ్చారు.

### మృతిచెందిన టీడీపీ కార్యకర్త వేణు గోపాల్ ఇంటికి వెళ్లి పరామర్శించిన మాజీ మంత్రి పల్లె



**నల్లమాడ, జన సముద్రం న్యూస్, మే 08:-**
నలమాడ మండలం యర్రవంక పల్లి లో వేణు కుటుంబాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు.ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త వేణుగోపాల్ కుటుంబాన్ని బుధవారం యర్ర వంకపల్లిలోని వారి నివాసానికి వెళ్లి మృతుడు వేణుగోపాల్ తల్లిదండ్రులు నరసప్ప వేణు గోపాల్ భార్య లక్ష్మి,కుమారుడు నందకుమార్ ను పరామర్శించి వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు.అన్ని విధాలుగా మీ కుటుంబానికి అండగా ఉంటామని ప్రభుత్వం నుంచి పార్టీ పరంగా అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.మాజీ మంత్రితోపాటు స్థానిక టిడిపి నాయకులు ప్రసాద్ రెడ్డి, లక్ష్మీనారాయణ,రామాంజనేయులు,మధు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హెల్త్ సెంటర్- మాచర్ల లో ఆయుష్మాన్ భారత్ హెల్త్ మిషన్ పోగ్రాం పై అవగాహన సదస్సు . కె.పి .చారి.



**పల్నాడు బ్యూరో జనసముద్రం న్యూస్, మే 8.**
ఆయుష్మాన్ భారత్ హెల్త్ మిషన్ పోగ్రాం వలన కలిగే ఉపయోగాలు గురించి డాక్టర్ కె. పి.చారి మెడికల్ సూపరిండెంట్ వివరించారు .1.పేషంట్ ఓ.పి నమోదు చేయించుకొనుటకు తక్కువ సమయంలో అయిపోతుంది.హాస్పటల్ క్యూ ఆర్ కోడ్ ద్వారా పేరు నమోదు చేసుకోవచ్చు దీని ద్వారా క్యూలో నిలబడే పని ఉండదు. అని చూపించారు.2.పేషెంట్ యొక్క వివరాలను ఆన్లైన్లో పొందుపరచటం,ఎన్నిసార్లు హాస్పటల్ కి వెళ్లారో తెలుసుకోవచ్చు, ఎన్ని రకాలు జబ్బులు ఉన్నాయో తెలుసుకోవచ్చు,హెల్త్ రికార్డును చనిపోయే వరకు చూడవచ్చు, అని తెలియపరిచారు. 3.ఆన్లైన్లో హెల్త్ రికార్డు పొందుపరచుటకు కావలసినవి ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ మరియు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ నెంబర్ అని తెలియపరిచారు.

# కుక్కునూరు మండల కేంద్రం లో ఎన్డీయే కూటమి నాయకులతో అలాగే ప్రజలతో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సమీక్ష సమావేశం.

**జనసముద్రం న్యూస్ కుక్కునూరు:మే 8**
మండలం లోని స్థానిక ఎమ్మార్వో కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశం లో అన్ని పంచాయతీల్లో ఉన్న సమస్యలపై ప్రజల నుండి ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వినతి పత్రాలను స్వీకరించారు.గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను ఆయనే స్వయంగా ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకొన్నారు గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు ఉన్న అధికారులు పని తీరు ఏ విధంగా ఉందో నిర్లక్ష్యం వహిస్తూ విధుల పట్ల అలసత్వం వహిస్తున్న వారి వివరాలు నేరుగా ఎమ్మెల్యే కి తెలియజేయాలని ఆయన ప్రజలను కోరారు.గత ప్రభుత్వం 5ఏళ్ల లో 50లక్షల రూపాయలతో నియోజకవర్గం అభివృద్ధి చేస్తే కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలం లోనే కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తూ నియోజకవర్గం లో అభివృద్ధి ని ఉరకలు పెట్టిస్తోందన్నారు.ఎన్నికల్లో నిర్వాసితులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నూరు శాతం అమలు చేసిందని నిర్వాసితులు ముఖాల్లో ఆనందాన్ని నింపిందని ఎమ్మెల్యే అన్నారు. నిర్వాసితులందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించాలంటే ముందుగా వారికి చెందాల్సిన ప్యాకేజీని అలాగే 18



సంవత్సరాలు నిండిన వారికి కూడా ప్యాకేజీ అందించే విధంగా ప్రభుత్వ పెద్దలతో మాట్లాడమని త్వరితగతన వారికి అందాల్సిన ప్యాకేజీ అందుతుందని, రాబోయే రోజుల్లో వరదలు వచ్చే నాటికి మీకు చెందాల్సిన ప్యాకేజీ అందించి తరలించే కార్యక్రమాన్ని చేపడతామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. నిర్వాసితుల కుటుంబాలు సుమారు 2944 మందికి గాను 2785 మందికి నష్ట పరిహారం అందిందని మిగిలిన 158 కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని వారికి కూడా త్వరలోనే ఆ నష్టపరిహారాన్ని అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. గత ప్రభుత్వంలో నిర్వాసితుల సమస్యలను గాలికి వదిలేసారని కూటమి ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే నిర్వాసితుల సమస్యలను పరిష్కరించమన్నారు. ఇటీవలే కాలంలో మంత్రి నాదెండ్ల మనోహర్ తో కలిసి నిర్వాసిత కాలనీలో పర్యటించగా వారు నివసిస్తున్న గృహాలు కూడా నాణ్యత లేకపోవడం గుర్తించామన్నారు. మరల టెండర్లను పిలిచి నిర్వాసితులను పునర్నిర్మానాలు చేపట్టి వర్షాకాలంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరామన్నారు. పోలవరం నిర్వాసితుల కుటుంబాలను ఎన్డీఏ ప్రభుత్వం ఎప్పుడూ కూడా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు ఈ కార్యక్రమం లో పాల్గొన్నవారు జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, కుక్కునూరు జనసేన మండల పార్టీ ప్రెసిడెంట్ ములిసెట్టి యుగంధర్, వేలేరుపాడు మండల పార్టీ ప్రెసిడెంట్ గణేశుల ఆదినారాయణ. బిజెపి మండల పార్టీ ప్రెసిడెంట్ తూము వెంకన్న, టిడిపి మండల ఉపాధ్యక్షులు మధుర వెంకటరమణ, కూటమి నాయకులు మంత్రి గోపాలకృష్ణ, వెంకన్న బాబు, సాంద్ర రవి ప్రసాద్, చల్లా కోటి, గాడిద వెంకటేశ్వర్లు, మద్దుల రాఘవ, ఆవుల శ్రీనివాస్, అమరవరపు సాయి, పొదిళ్ల ధనస్వామి, పరిటాల గణేష్, కుంజ భద్రం, సత్యనారాయణ, నరేంద్ర రాజు, పిచ్చుక హరిబాబు, రామకృష్ణ, గంజి రాంబాబు తదితర కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## వివాహ మహోత్సవానికి హాజరైన మాజీ మంత్రి



- త్రాగునీటి తొట్టె ను ప్రారంభించిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

**అమడగూరు,జన సముద్రం న్యూస్,మే 08:-**
పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని అమడగూరు మండలం జౌకుల కొత్తపల్లి గ్రామంలో యనుమల వారి పెళ్లి పిలుపు వివాహ మహోత్సవానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నూతన వధూవరులు సుబ్రహ్మణ్యం, హారిక ను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆశీర్వదించారు.అక్కడికి విచ్చేసిన వారందరిని అప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.అదే గ్రామంలో పశువుల త్రాగునీటి తొట్టె ను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు.కందుకూరి పల్లిలో టీడీపీ సీనియర్ నాయకులు సుబ్బయ్య ,కృష్ణమూర్తి ఇతర కార్యకర్తల కుటుంబాలను పరార్శించారు.ధైర్యంగా ఉండాలని వారికి భరోసా ఇచ్చారు.అనంతరం మహమ్మదాబాద్ లో టీడీపీ కార్యకర్త నాగేంద్రరెడ్డి ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ రద్దు కొరకు కార్మిక సమ్మె.



**పల్నాడు బ్యూరో జన సముద్రం న్యూస్, మే 8.**
పల్నాడు జిల్లా,పిడుగురాళ్ల నందు సిపిఎం కార్యాలయం నందు వివిధ కార్మిక సంఘాలతో సమావేశం ఏర్పాటు . శ్రమ జీవుల హక్కుల కు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన లేబర్ కోడ్ వ్యతిరేకంగా మే 20 న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి అని కోరుతూ గురువారం నాడు సన్నాహక సమావేశం జరిగింది.

## పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం
- పీజీ కామన్ ఎంట్రెన్స్ పరీక్షను రద్దుచేసి పాత పద్ధతుల్లో నిర్వహించాలి
- పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే 107 108 జీవోలను రద్దు చేయాలి
- యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- ఏఐఎస్ఎఫ్ డిమాండ్

**పుట్టపర్తి,జన సముద్రం న్యూస్,మే 08:-**
రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ శ్రీ సత్య సాయి జిల్లా సమితి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి గుజ్జుల వలరాజు,బందెల నాసర్ జీ మాట్లాడుతూ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి ఇచ్చినటు వంటి హామీలో భాగంగా పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.వైసీపీ ప్రభుత్వం పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత చదువులకు దూరం చేసే పద్ధతులలో జీవో నెంబర్ 77 తీసుకువచ్చి కేవలం ప్రభుత్వ విద్యాసంస్థలు చదివే వారికి మాత్రమే ఫీజు రీయింబర్స్మెంట్ పథకం వర్తింప జేస్తుందని ప్రైవేట్ విద్యా సంస్థల్లో పీజీ చేసే విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ వర్తించదని జీవో నెంబర్ 77 తీసుకోవడం జరిగిందన్నారు.తక్షణమే జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులతో కిటకిట లాడుతున్న యూనివర్సిటీ లలో రాష్ట్ర వ్యాప్తంగా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తీసుకోవడం వల్ల యూనివర్సిటీలో విద్యార్థులు లేనటువంటి దౌర్భాగ్య మైనటువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొంది అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలో బాగు పరచాలంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కామన్ ఎంట్రెన్స్ ప్రవేశ పరీక్షను రద్దుచేసి ఏ యూనివర్సిటీకి సంబంధించిన ప్రవేశ పరీక్ష ఆయా



యూనివర్సిటీ నిర్వహించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న సందర్భంలో వైద్య విద్యను పేదలకు దూరం చేసే విధంగా జీవో నెంబర్ 107,108 తీసుకువచ్చి వైద్య విద్యను కోట్ల రూపాయలకు అమ్ముతుండడంతో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ జీవోలను రద్దు చేస్తూ ప్రతి పేద విద్యార్థికి వైద్య విద్యను అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తుకు చేశారు.తక్షణమే పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే జీవో నెంబర్ 107,108 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ వసతి దీవన బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్న తూతూ మంత్రంగా 788 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి చేతులు దులుపుకుందన్నారు. మాకు కావాల్సింది 788 కోట్లు కాదు 3580 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు దోపిడీ చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనకు వ్యతిరేకంగా పాఠ్య పుస్తకాలను వేలాది రూపాయలకు అమ్ముకుంటూ వ్యాపారం చేస్తున్నా కూడా కూటమి ప్రభుత్వం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర సహాయ కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ అసిస్టెంట్, ప్రొఫెసర్ టీచింగ్,నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శేషం మహేంద్ర,ఉపాధ్యక్షులు నరసింహమూర్తి,హరి ప్రసాద్, నందకిషోర్,రాజుయల్,అభిషేక్,గణేష్,నవీన్,మహేష్ నాయక్,వినోద్,ప్రకాష్,తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల్లో ఉన్న కుటుంబాలకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆర్థిక సాయం



**ఓడి చెరువు,జన సముద్రం న్యూస్,మే 08:-**
ఓడిసి మండలం దబురువారి పల్లి లో ఉత్తమ్మ కుటుంబాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు.ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చి కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు.అలాగే జంబులవాండ్ల పల్లి గ్రామంలో ఆర్టీసీ డ్రైవర్ జయచంద్ర వారి కుటుంబ సభ్యులు తిరుపతిలో యాక్సిడెంట్ కు గురై జయచంద్ర మనవరాలు హరిప్రియ (11)అక్కడకక్కడే మృతి చెందగా మిగతా కుటుంబ సభ్యులు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆ కుటుంబ కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కొంత ఆర్థిక సహాయం అందజేశారు.

## 9 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు తొలగింపు

**జనసముద్రం న్యూస్, మే 8, నరసరావుపేట**
విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని జిల్లాలో 9 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగిస్తున్నట్లు డిఆర్డిఏ పిడి ఝాన్సీ రాణి తెలిపారు. ఈ తొమ్మిది మంది ఒక పనికి సంబంధించిన ఐడి ఫోటోను వివిధ పనుల ఐడీలకు అప్లోడ్ చేసినట్లు ఎన్ఎంఎంఎస్ నివేదిక ద్వారా నిర్ధారించినట్లు ఆమె చెప్పారు. బెల్లంకొండ, కొప్పునూరు, శావల్యాపురం, వెల్లటూరు, ఇర్లపాడు, మాడుగుల, దొండపాడు రేమిడిచర్ల, పిట్టంబండ ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తాత్కాలికంగా తొలగించినట్లు ఆమె తెలియజేశారు.

## అధికారిక లాంచనాలతో సుగవాసి పాలకొండ్రాయుడు అంత్యక్రియలు

- అంత్యక్రియలలో పాల్గొన్న టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ రెడ్డి

**రాయచోటి, జన సముద్రం న్యూస్ మే 08:-**
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజంపేట మాజీ ఎంపీ మరియు రాయచోటి మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు అంత్యక్రియలు గురువారం అధికార లాంచనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి నియోజకవర్గంలోని పలువు టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు.



రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగువాసి పాలకొండ్రాయుడు నాలుగు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీగా గెలిచి రాయచోటి నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేయడం జరిగిందన్నారు. నేడు ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని డాక్టర్ లక్ష్మి ప్రసాద్ రెడ్డి దేవుని ప్రార్థించారు.

## శక్తికి మించి అప్పులు చేసి తీర్చలేక ఆత్మహత్య: చౌడేపల్లి



**జనసముద్రం న్యూస్, మదనపల్లి, 08 మే 2025.**
చౌడేపల్లి మండలం, ఏ కొత్తకోట పంచాయతీ, అగ్రహారం గ్రామంలో సి. లోకేష్, వయసు 26 సంవత్సరాలు, తండ్రి లేట్ కమలాకర్, అనే వ్యక్తి శక్తికి మించిన అప్పులు చేసి వాటిని తీర్చలేక, మనోవేదనతో క్షణకావేశంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మరణించాడు, లోకేష్ తల్లి హేమావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని చౌడేపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తునారు.

## మే 10నుంచి శ్రీ భద్రావతి భావనారాయణ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు



**ఒంటిమిట్ట జన సముద్రం న్యూస్ మే 8:**
స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సర వైశాఖ శుద్ధ ద్వాదశి (గురువారం) మే 10న ప్రారంభమై, వైశాఖ బహుళ సప్తమి (శనివారం) మే 18 వరకు మొత్తం 9 రోజుల పాటు కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలోని కొండమాచుపల్లె గ్రామం ఆధ్యాత్మిక ఉత్సాహంతో సందడిగా మారనుంది. శ్రీ పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న శ్రీ భద్రావతి భావనారాయణ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది మరింత భక్తి, భవ్యతతో నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి.ఈ ఉత్సవాలు పద్మశాలీయ కులపరంపర, సంస్కృతి, సమాఖ్యా గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. స్వామివారి నిత్యార్చన, హెూమహవనాలు, రథోత్సవాలు, కళ్యాణోత్సవం వంటి విశేష కార్యక్రమాలు భక్తుల హృదయాలను రంజింపజేయనున్నాయి.

**ఉత్సవాల కార్యనిర్వాహణ తేదీ వారీగా ఇలా:**
10-05-2025 (శనివారం):సాయంత్రం - అంకురార్పణ, పుట్ట బంగారం కార్యక్రమంతో ఉత్సవాలను ప్రారంబిస్తారు. 11-05-2025 (ఆదివారం):ఉదయం - గణపతి పూజ అనంతరం ధ్వజారోహణం సాయంత్రం - శేషవాహన సేవ 12-05-2025 (సోమవారం): ఉదయం - నవగ్రహ హెూమము సాయంత్రం - హంస వాహన ఉత్సవము 13-05-2025 (మంగళవారం): ఉదయం - సూర్యప్రభ వాహన సేవ సాయంత్రం - చంద్రప్రభ వాహనం, పులివాహన ఉత్సవం 14-05-2025 (బుధవారం): ఉదయం - హెూమము, మోహిని అవతార దర్శనం సాయంత్రం - గరుడ వాహన సేవ 15-05-2025 (గురువారం): ఉదయం - అభిషేకం సాయంత్రం - సాయంకాల 7:30 నుంచి 8:30 వరకు స్వామివారి కళ్యాణోత్సవం, అనంతరం గ్రామ మెరువణి కార్యక్రమం 16-05-2025 (శుక్రవారం): ఉదయం - అభిషేకం సాయంత్రం - రథోత్సవం, భక్తుల నడక పల్లకీ ఊరేగింపు 17-05-2025 (శనివారం): ఉదయం - వసంతోత్సవం 18-05-2025 (ఆదివారం): ఉదయం - మహా నైవేద్యము సమర్పణతో ఉత్సవాలు సంపూర్ణమవుతాయి శ్రీ భావనారాయణ స్వామి పరమ వైభవం: పద్మశాలీయుల ఆరాధ్య దైవమైన శ్రీ భావనారాయణ స్వామి, ఒకదానిని పులిని వాహనంగా వాడుతూ కాళ్వాసురుని సంహరించిన మహాపురుషుడు. ఆయనను ఆశ్రయించిన పద్మశాలీయులు దేవతలకు వస్త్రాల్ని తయారుచేసే పవిత్ర వృత్తిని చేపట్టి విశిష్ట స్థానాన్ని సంపాదించారు. పద్మం నుంచి దారాన్ని తీయగల నైపుణ్యం స్వామివారి వరంగా ప్రసాదించబడినదని పురాణగాథలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంతో పద్మశాలీయులు “వస్త్ర ధారకులు %-% సంస్కృతి సాధకులు”గా పేరొందారు. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా యావత్ పద్మశాలీయ బాంధవులు, ఆరాధకులు, భక్తులు తగిన భక్తిశ్రద్ధలతో పాల్గొని, స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించి వారి కృపకు పాత్రులు కావాలని శ్రీ పద్మశాలీయ బహూత్తమ సంఘం, కొండమాచుపల్లె గ్రామం తెలియజేయడమైనది.

## పాలకొండ్రాయుడి పార్తివదేహానికి శ్రీ సాయి విద్యాసంస్థల అధినేత ఘన నివాళి

- మాజీ పార్లమెంటు మరియు అసెంబ్లీ సభ్యుడు, సుదీర్ఘకాల రాజకీయ జీవితాన్ని గడిపిన నేత సుగవాసి పాలకొండ్రాయుడు పరమపదించిన సందర్భంగా ఆయన పార్థివ దేహానికి శ్రీ సాయి విద్యాసంస్థల అధినేత కే.పీ.వి. సుబ్బయ్య ఘన నివాళి అర్పించారు.

**రాయచోటి జనసముద్రం న్యూస్ మే 8**
ఈ సందర్భంగా ఆయన పాలకొండ్రాయుడి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజాసేవకు ఆయన అంకితంగా పనిచేశారనీ, ఆయన సేవలు చిరస్మరణీయమవుతాయనీ గుర్తు చేశారు. పాలకొండ్రాయుడి కుటుంబ సభ్యులకు, బంధువులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన కే.పీ.వీ సుబ్బయ్య, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో శ్రీ సాయి ఇంజినీరింగ్



కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయాలి

**యాదాద్రి భువనగిరి జిల్లా (మే.08) జనసముద్రం న్యూస్**

భువనగిరి మున్సిపల్ కార్యాలయం నందు ఇంచార్జ్ కమిషనర్ కి ఇందిరమ్మ గృహాల కోసం అప్లికేషన్ చేసుకున్న వారిలో అర్హులైన వారందరికీ గృహాలను మంజూరు చేయాలని గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లాటరీ పద్ధతిలో తీయడం జరిగింది.కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీ సభ్యులు అని కాంగ్రెస్ కార్యకర్తలను పెట్టి వారు నిర్ణయించిన పేర్లనే ఫైనల్ చేయడం జరుగుతుంది ఆ విధంగా చేస్తే సామాన్య ప్రజలు నష్టపోవడం జరుగుతుంది కావున వీటి మీద ఎంక్వయిరీ చేసి అర్హుల అందరికీ ఇవ్వాలని కోరడం జరిగింది.మరియు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు గత ప్రభుత్వంలో ప్రతినిలవారీగా






జీతాలు అందేవి కానీ ఈ ప్రభుత్వంలో గత రెండు నెలల నుండి వారికి జీతాలు ఇవ్వడం లేదు కావున వారికి వెంటనే జీతాలు ఇవ్వాలని జీతాలతో పాటు గత ప్రభుత్వంలో మూడు నెలలకు ఒకసారి సబ్బులు,గ్లౌజులు వారికి ఉపయోగపడే వస్తువులను ఇచ్చేది కానీ,ఈ ప్రభుత్వంలో అందియ్యడం లేదు కావున వాటిని కూడా వెంటనే ఇవ్వాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో పట్టణ బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

**జనసముద్రం న్యూస్. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.**

అశ్వారావుపేట పట్టణంలో గురువారం ఉదయం పోలీసులు నిషేధిత గంజాయిని ఐదున్నర కేజీలు స్వాధీనం చేసుకున్నారు దాని విలువ. రెండు లక్షల 75000 ఉంటుందని అంచనా వేశారు ఊట్లపల్లి నుండి అశ్వారావుపేటకు వైపు కు మూడు మోటార్ సైకిల్ పై ఏడుగురు వ్యక్తులు వస్తున్నారన్న సమాచారంతో వాహనాలు తనిఖీ చేస్తూండగా అశ్వారావుపేట పోలీసులు హెచ్ పి పెట్రోల్ బంక్ సమీపంలో వారిని పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినారు వారి వివరాలు షేక్ ఫిరోజ్ ఖాన్. గండికోట ప్రభుకుమార్. పసుపులేటి



గోపీచంద్. వీరు ముగ్గురు అశ్వారావుపేటకు చెందినవారుకాగా . పుట్ట జగదీష్ జంగారెడ్డిగూడెం. ఆవుల సుధీర్ రెడ్డి ఈర్లపాడు శావల్యాపురం మండలం. తిరువీధుల కార్తీక్ ఉప్పలూరు కంకిపాడు మండలం. బుల్లా సంజయ్ చంపాపేట్ హైదరాబాద్. పట్టుబడినారు. రాము అనే గంజాయి వ్యాపారి మరి కొంతమంది పరారీలు ఉన్నట్లు తెలియజేసినారు

ఈ కార్యక్రమంలో అశ్వారావు పేట సిఐ పి నాగరాజు. ఎస్సై యయాతి రాజు. హెడ్ కానిస్టేబుల్ నాగేంద్రావు. పీసీలు హరిబాబు.కృష్ణ ప్రసాద్. రమేష్ రావు.రామకృష్ణ. నరేష్ బాబు. భానుచందర్. ఎన్ వెంకటేశ్వరరావు.బి సంతోష్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు

# శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్..

- ఆలయం ముందు కేక్ కట్ చేసిన మంత్రి..
- భారత సైన్యానికి మద్దతు తెలుపుతూ అభినందనలు..
- ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పిలుపు..

**చిగురుమామిడి జన సముద్రం న్యూస్ మే.8:**

మండలంలోని సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆలయంలో రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అధికారులు,కార్యకర్తలు, నాయకులు,అభిమానులు, ప్రజలు మంత్రి పొన్నంకు ఆలయం వద్ద ఘన స్వాగతం పలికారు.ప్రత్యేక పూజల అనంతరం ఆలయం ముందు కార్యకర్తల సందడి మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేలా తనకు స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు.దేశ సరిహద్దుల్లో జరుగుతున్న పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు ఎక్కడ కూడా తగ్గకుండా భారత సైన్యం అంతర్గతంగా రక్షించుకుంటూ,సరిహద్దులను కాపాడుకుంటూ,





ఎదుటివారికి ప్రవేశం లేకుండా కఠినంగా వ్యవహరిస్తు చర్యలు తీసుకుంటున్న సందర్భంగా వారికి మద్దతుతోపాటు వారికి అభినందనలు తెలిపారు.రాజకీయాలకు అతీతంగా భారత ప్రభుత్వం మరింత అంతర్గతంగా పక్క దేశాలతోటి కఠినంగా గట్టిగా ఉంటూ ఎక్కడ కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆలయ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, కరీంనగర్ ఆర్డిఓ మహేశ్వర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తాహాశీల్దార్ ముద్దసాని రమేష్, ఆలయ చైర్మన్ చొల్లేటి శంకరయ్య, అర్చకులు శేషం నరసింహ చార్యులు,శేషం సుధీర్ చార్యులు, కాంగ్రెస్ నాయకులు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, బొలిశెట్టి శివయ్య, ఆలయ ఈవో కొండపర్తి రాజ్ కుమార్,మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్,చిట్టుమల రవీందర్,మాజీ సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్,ఆలయ కార్యనిర్వాహణ అధికారి బూట్ల కవిత,మాజీ కార్పొరేటర్ గుర్రం మురళి గౌడ్,కాటం సంపత్ రెడ్డి,పోటు మల్లారెడ్డి, ఎనగందుల లక్ష్మణ్,ఇనుగాలశ్రీనివాస్ రెడ్డి,ఓరుగంటి భారతీదేవి, పోలు స్వప్న యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయిని వేణు,మహమ్మద్ షాబుద్దీన్,అందె మేకల పరశురాములు,పచ్చిమట్లజగన్,గట్టు ప్రశాంత్, బోయిని వంశీకృష్ణ,ఎనగందుల శివకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పులి సంపత్ గౌడ్..

**చిగురుమామిడి జనసముద్రం న్యూస్ మే 8:**

పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, తెలంగాణ రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులి సంపత్ గౌడ్ గురువారం మంత్రిని హుస్నాబాద్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం విలేకరులతో పులి సంపత్ గౌడ్ మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్దె ధ్యేయంగా, హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం తపిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని సంపత్ గౌడ్ ఆకాంక్షించారు.బిసిబిడ్డ పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ కి ఎమ్మెల్యే కావటం,రాష్ట్రానికి మంత్రి కావటం గర్వంగా ఉందని సంపత్ గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు.




# పహల్గామ్ మారణహోమానికి నిరసనగా హుజూరాబాద్‌లో భారీ ర్యాలీబీ ఉగ్ర స్థావరాలపై సైన్యం చర్యను ముక్తకంఠంతో స్వాగతించిన బేడ బుడగ జంగం సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు..

**జనసముద్రం న్యూస్ (కరీంనగర్ ప్రతినిధి)**
**హుజూరాబాద్, మే 8:**

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో గత నెల 22న జరిగిన దారుణమైన ఉగ్రదాడికి నిరసనగా హుజూరాబాద్‌లో బుధవారం బేడ బుడగ జంగం జన సంఘం ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు సంఘ సభ్యులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకుని ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా సిరిపాటి వేణు మాట్లాడుతూ, పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన ఈ దుర్మార్గపు దాడిలో 26 మంది అమాయక భారతీయులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు.మృతులను కేవలం హిందువులు, ముస్లింలుగా చూడకుండా భారతీయులుగా గుర్తించి వారి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం





చేశారు.అమాయక ప్రజల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులకుభారత సైన్యం ధీటుగా బదులివ్వడాన్ని ఆయన ముక్తకంఠంతో స్వాగతించారు. భారత ఆర్మీ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' విజయవంతంగా కొనసాగిందని, ఈ ఆపరేషన్‌లో పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై మెరుపుదాడి చేసి సుమారు 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టడం అభినందనీయమని కొనియాడారు. భారత సైన్యానికి బేడ బుడగ జంగం జన సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆయన అన్నారు. ఉగ్రవాదుల ఆట కట్టించేందుకు భారత ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యలను సంఘం పూర్తిగా సమర్థిస్తుందని సిరిపాటి వేణు స్పష్టం చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని, ప్రజల భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఈ నిరసన కార్యక్రమంలో బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తూర్పాటి లింగయ్య, భూతం అంజి, గంధం మధు, తూర్పాటి రమేష్, తూర్పాటి అనిల్, తూర్పాటి రజినీస్, మల్లయ్య, తూర్పాటి దుర్గయ్య, మోటం రమేష్, కడమంచి స్వామి, మోటం సాయిలు, తూర్పాటి ఉపేందర్, భూతం తిరుపతితో పాటు పెద్ద సంఖ్యలో సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంగారం మండల నూతన ఎమ్మార్వో గా బి బాలకిషన్ భాద్యతలు స్వీకరన

**మహబూబాబాద్ జిల్లా,జనసముద్రం న్యూస్ రిపోర్టర్ గంగారం మే 8:**

గంగారం మండల నూతన తహసీల్దార్ గా బి బాలకిషన్ గురువారం భాద్యతలు స్వీకరించారు.నిన్నటి వరకు గంగారం మండల తహసీల్దార్ గా విధులు నిర్వర్తించిన సత్యనారాయణ ఖమ్మం బదిలీ పై వెళ్లడంతో. గంగారం నూతన తహసీల్దార్ గా తొర్రూరు ఆర్డీఓ ఆఫీస్ లో. డి ఏ ఓ గా పని చేసిన బి బాలకిషన్ గంగారం నూతన తహసీల్దార్ గా గురువారం విధులలో చేరారు.నూతన తహసీల్దార్ కు ఎమ్మార్వో ఆఫీస్ సిబ్బంది మరియు గ్రామస్తులు గ్రాడ్యుయేట్ కమిటీ అధ్యక్షులు జెజ్జరీ రాము ఎమ్మార్ పీస్ గంగారం మండల అధ్యక్షులు &జన సముద్రం రిపోర్టర్ మెంతినీ సురేష్ పుష్ప గుచ్చం అందించి స్వాగతం పలికారు.



# అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత




**జనసముద్రం న్యూస్ భీమారం మే 8:**

అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్టు భీమారం ఎస్సై కే , శ్వేత తెలిపారు, భీమారం ఎస్సై కే ,శ్వేత మాట్లాడుతూ భీమారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రెండు ట్రాక్టర్లు మట్టి తీసుకొని వెళ్తుండగా ట్రాక్టర్లను ఆపి విచారించగా ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నట్టు తెలియడంతో ట్రాక్టర్ ఓనర్లు అనపర్తి మధుకర్, ఇస్లావత్ శివరాంపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు

# ముగ్గురు గ్రేహౌండ్స్ జవాన్లు మృతి

**జనసముద్రం న్యూస్ వెంకటాపురం మే 8:**

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని వీరభద్రవరం గుట్టలపై మావోయిస్టులు అమర్చిన ఐఈడి పేలి ముగ్గురు గ్రేహౌండ్స్ జవాన్లు మృతిచెందగా వారి మృతదేహాలను ఎంజీఎం మార్చురీకి తరలించిన గ్రేహౌండ్స్ సిబ్బంది. మృతి చెందిన ముగ్గురు శ్రీధర్, సందీప్, పవన్ కళ్యాణ్ జవాన్లుగా గుర్తింపు. ఇదే ఘటనలో వరంగల్ మండలం పైడిపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎస్ఐ రణధీర్ తీవ్ర గాయాల పాలు కాగా మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఏఐజి ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. వరంగల్ కు చేరుకున్న డీజీపీ జితేందర్, గ్రేహౌండ్స్ డీజీ స్టీఫెన్ రవీంద్ర మరికొద్ది సేపట్లో ఎంజీఎం మార్చరీలో మృతదేహాలను సందర్శించనున్నారు. ఇప్పటికే ఎంజీఎం మార్చురీ వద్దకు మృతుల కుటుంబ సభ్యులు, పెద్ద ఎత్తున పోలీసు బలగాలు చేరుకున్నాయి.



# తెలంగాణ రాష్ట్ర పేద ప్రజలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అందిస్తున్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదములు

## -ముల్లి పావని జంగయ్య యాదవ్ ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్పర్సన్




**మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా (మే.08) జనసముద్రం న్యూస్ ఘట్కేసర్:-**

పేద ప్రజలకు అర్హులకు జీరో బిల్స్ వస్తున్నాయని తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిన సీఎం రేవంత్ రెడ్డి.ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలులోకి తీసుకొస్తున్నారు.ఈ క్రమంలోనే ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిధి పెంపును అమలు చేస్తున్న ప్రభుత్వం.తెలంగాణలో గృహజ్యోతి పథకం అమల్లోకి వచ్చి 17 నెలలు కావొస్తుంది అని 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అందిస్తూ ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తు, రేషన్ కార్డు ఆధారంగా అర్హులైన వారికి బిల్లింగ్ మిషన్స్ లో నుంచి ఆటోమేటిక్ గా జీరో బిల్ వెచ్చేలా చూస్తామని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్టం అప్పులో ఉన్న కూడా మన ముఖ్య మంత్రి మనకు సంక్షేమ పథకాలు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

# కందనెల్లి గ్రామములో ఇందిరమ్మ ఇండ్ల ధృవీకరణ కార్యక్రమము

**జనసముద్రం న్యూస్ పెద్దెముల్ (మే8)**

పెద్దేముల్ మండల పరిధిలోని కందనెల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ పరిశీలించుటకు ప్రాజెక్ట్ డైరెక్టర్ హౌసింగ్ కృష్ణయ్య, డిప్యూటీ ఇంజనీర్ యండి కలిముద్దీన్,మండల అభివృద్ధి అధికారి రతన్ సింగ్,ఇండ్ల వెరిఫికేషన్ అధికారి మండల విద్యాధికారి నర్సింగ్ రావు,మండల హౌసింగ్ ఇంజనీర్ యండి రహీం, పంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడుతూ

ఇంటి స్థలాలను పరిశీలించడం జరిగింది.అని మండల ఇంచార్జ్ ఎంపీడీవో రతన్ సింగ్ తెలియజేశారు.



# ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ




**యాదాద్రి భువనగిరి జిల్లా (మే.08)జనసముద్రం న్యూస్ బీబీనగర్:-**

ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం పురస్కరించుకొని బీబీనగర్ మండల కేంద్రంలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రులలో జరిగినది మండల కన్వీనర్ పడకంటి శ్రీనివాస్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా తలసేమియా బాధితులకు రక్త సంబంధం బాధితులకు సాయం కల్పిస్తూ అదేవిధంగా అందరికీ ఆరోగ్యం విద్యార్థులకు సిపిఆర్ అవగాహన వృద్ధులకు అండగా నిలుస్తుంది.రెడ్ క్రాస్ సంస్థ అని కొనియాడారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ జై శ్రీ మేడం గారు స్టాఫ్ నర్స్ జ్యోతి ఆరోగ్యమ్మ సరోజ కవితతో పాటుగా బీబీనగర్ రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు మంచాల అనిల్,అస్గర్ అలీ,పాముకుంట్ల ఉష కిరణ్,శివ,బక్కన నరసింహ,హనుమంతు,రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంజనీరింగ్ సర్వీసేస్ పరిక్షలో 40వ ర్యాంక్ సాధించిన ముద్దసాని బాను ప్రసాద్

## అభినందించి సన్మానించిన బిజెపి నాయకులు దొంతిసారపు సంపత్

**చొప్పదండి(జనసముద్రం న్యూస్)**

చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని బాను ప్రసాద్ ఇంజనీరింగ్ సర్వీసేస్ పరిక్షలో ప్రతిభ కనబరిచాడు. ఇటీవల వెలువడిన అల్ ఇండియా యుపిఎస్సి ఇంజనీరింగ్ సర్వీసేస్ పరిక్షలో 40వ ర్యాంక్ సాదించినాడు, ఈ సందర్భంగా బాను ప్రసాద్ ను, ప్రోత్సహించిన వారి కుటుంబ సభ్యులకు జిల్లా బిజెపి నాయకులు దొంతిసారపు సంపత్ ఘనంగా సన్మానించి అభినందించడం జరిగినది.



## మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫ్రీజర్ ఏర్పాటు




**జనసముద్రం వెంకటాపురం మే 8:**
ములుగు జిల్లా వెంకటాపురం నూగూరు మండలం మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శవపేటిక ఏర్పాటు చేశారు. ఫ్రీజర్ ను వెంకటాపురం మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద షెడ్డు నిర్మించి అందుబాటులోకి తెచ్చారు. సుమారు రూ.35 వేల ఫ్రీజర్ ను భద్ర పరిచే షెడ్డును పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. మున్నూరు కాపు సంఘం వెంకటాపురం మండల శాఖ కమిటి ఆధ్వర్యంలో విరాలాలు సేకరించి కొనుగోలు చేశారు. వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన వారు ఎవరైనా వాడుకోని కార్యక్రమాలు అయిపోయిన వెంటనే తిరిగి జాగ్రత్తగా తీసుకు వచ్చి షెడ్ లో ఉంచాలని సంఘం నాయకులు కోరారు. అవసరమైన వారు వెంకటాపురం మేజర్ పంచాయతీ సిబ్బంది తాటి శ్రీను సెల్ నెంబర్ 94 91357661, దేవరకొండ లక్ష్మణ్ సెల్ నెంబర్. 7036393517 లలో సంప్రదించాలన్నారు.

## అన్నదానంతో సమానమైనది చలివేంద్రాల ద్వారా దాహార్తిని తీర్చడం

### –టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్





**మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా (మే.08)జనసముద్రం న్యూస్:**
ఘట్కేసర్ మున్సిపల్ సమీపంలో వల్లమాల్ల సంధ్యారాణి ప్రవీణ్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్నిగురువారం రోజున టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా వజ్రేశ్ యాదవ్ మాట్లాడుతూ ఆకలితో అలమటిస్తున్న పేదవారి కడుపు నింపడం ఎంత పుణ్యమో,దాహార్తితో గొంతు ఎండిపోతున్న వారికి మంచినీళ్లను అందించడం కూడా అంతే పుణ్యమని టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు

## ఏటిఎంఎ చొప్పదండి డివిజన్ చైర్మన్ గా గుర్రం రాజేందర్ రెడ్డి నియామకం

### మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన సన్మానం



**చొప్పదండి(జనసముద్రం న్యూస్):**
వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ చొప్పదండి డివిజన్ లో చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాలు చైర్మన్ గా చొప్పదండి పట్టణానికి చెందిన గుర్రం రాజేందర్ రెడ్డి నియమితులైన సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన శాసనసభ్యులు మేడిపల్లి సత్యం గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోవు రోజుల్లో మూడు మండలాల రైతులకు అధికారులతో కలిసి వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అధిక దిగుబడులు పొందే విషయంలో అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ ఛైర్మన్ కొత్తూరు మహేష్, పట్టణ అధ్యక్షుడు చందు, గంగయ్య గౌడ్, ముద్దం తిరుపతి, సుధాకర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, గుర్రం రమేష్ గౌడ్, మావురపు రాములు, కడారి శంకర్, మస్తాన్, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర్లు పార్టివ దేహాన్ని సందర్శించిన జూలకంటి

**పల్నాడు బ్యూరో జనసముద్రం న్యూస్, మే 8.**
దుర్గి మండలం, ముటుకూరు గ్రామంలో జనసేన నాయకులు తోటకూర శ్రీనివాసరావు తండ్రి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో స్వర్గస్థులైన సందర్భంలో ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొని నివాళులు అర్పించారు.



## తిరుపతి- పుంగనూరు హైవే పై సోమల వద్ద కరెంటు ట్రాన్స్ఫార్మర్ ని డీ కొట్టిన కారు.



**జనసముద్రం న్యూస్ మదనపల్లి, సోమల, 08 మే 2025:-**
తిరుపతి–పుంగనూరు హైవే పై సోమల సినిమా సర్కిల్ వద్ద ఇండియన్ ఆయిల్ పెట్రో ల్ బంక్ సమీపంలో గురువారం బాకారపేట నుంచి వస్తున్న కారు రోడ్డు పక్కన వున్న కరెంటు ట్రాన్స్ఫార్మర్ ను డీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందర భాగం నుజ్జు నుజ్జు అయింది. అందులో ప్రయాణిస్తున్న భాకరాపేట కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 108 ద్వారా సదుం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సోమల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదంలో విద్యుత్ స్తంభానికి ఏర్పాటుచేసిన ట్రాన్స్ఫార్మర్ కొంత దూరంలో ఎగిసిపడింది. అందుకు అమర్చిన బండరాళ్లు 30 మీటర్ల దూరంలో పడ్డాయి. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పినది.



## నేడే మున్సిపాలిటీ ఇన్చార్జ్ చైర్మన్ గా మదార్ సాహెబ్ ప్రమాణస్వీకారం

**జనసముద్రంన్యూస్, మాచర్ల , మే 8 :**
నేడు అనగా 09-05-2025 శుక్రవారం ఉదయం 10 గం.లకు మాచర్ల మున్సిపల్ కార్యాలయం నందు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, 27వ వార్డు కౌన్సిలర్ షేక్ మదర్ సాహెబ్ మాచర్ల మున్సిపాలిటీ ఇన్చార్జి చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేయుచున్నారు.

## ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు

**-దేవాలయాల్లో ప్రత్యేక పూజలు**
**-హనుమాన్ దీక్ష పరులకు భోజన బిక్ష**
**- ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**జనసముద్రం న్యూస్, కోహెడ, మే 8 :( కోహెడప్రసాదరావు)**
రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రివర్యులు స్థానిక శాసనసభ్యులు పొన్నం ప్రభాకర్ 58వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని కొత్తకొండ దేవస్థానములో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు ఈ సందర్భంగా ఆలయ అధికారులు అర్చకులు మంత్రి ఫోన్ నెంబర్ ప్రభాకర్ గా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అలాగే చికెన్ మామిడి మండలంలోని సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం పొట్లపల్లిలోని శ్రీ స్వయంభు రాజరాజేశ్వర స్వామి



ఆలయంలో స్వామికి అభిషేకం గావించారు. హుస్నాబాద్ పట్టణంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హుస్నాబాద్ లోని క్యాంప్ కార్యాలయంలో పలువురు నాయకులు, అధికారులు, ఉద్యోగులు, అభిమానులు పార్టీ కార్యకర్తలు మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని హుస్నాబాద్ కోహెడ మండలాల్లో పార్టీ కార్యకర్తలు పలు కార్యక్రమాలను నిర్వహించారు. కోహెడలోని శ్రీ సీతారామచంద్ర స్వామి శ్రీ పార్వతి రాజరాజేశ్వర



స్వామి భారత దేవస్థానం హరిహర క్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ మాల ధారులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక కళ్యాణ మండపంలో హనుమాన్ దీక్షాపరులకు భోజన భిక్షను వితరణ చేశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని అభినందించిన వారందరితోపాటు, వివిధ కార్యక్రమాలను నిర్వహించిన నాయకులకు కార్యకర్తలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

## భారత సైనికులకు మరిన్ని విజయాలు కలగాలని కోరుతూ ఆలయాల్లో పూజలు

**జనసముద్రం న్యూస్, కోహెడ, మే 8:( కోహెడ ప్రసాద రావు)**
భారత ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ సింధూర్ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భారత సైనికులకు మరిన్ని విజయాలు కలుగాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.
సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి వారాల దేవస్థానం హరిహర క్షేత్రంలో గురువారం పలువురు యువకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ పేరట పాకిస్తాన్ పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రవాదుల శిబిరాలే లక్ష్యంగా భారత సైన్యం చేపట్టిన దాడులు విజయవంత విజయ కావడం పట్ల హర్షం వ్యక్తం



చేస్తూ, తిరిగి ఎలాంటి దాడుల్లోనైనా భారత సైనికులకు విజయం కలగాలని కాంక్షిస్తూ ఈ పూజా కార్యక్రమాలు చేపట్టినట్లు వారు వెల్లడించారు.భారత సైనికులకు మరిన్ని విజయాలు లభించాలని దుష్ట పాకిస్తాన్ కపట బుద్ధి మారాలని కోరుతూ ఆలయంలో స్వామివారికి పురుష సూక్త అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో భారతదేశానికి పటిష్టమైన రక్షణ కలగాలని, అలాగే భారత సైనికులకు మరిన్ని విజయాలు కలగాలని ఈ సందర్భంగా వారు భగవంతుని ప్రార్థించినట్లు వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో పేర్యాలరాజేశ్వరరావు, నరాల శ్రీకాంత్,కొండబత్తిని సతీష్, బండ సుమన్, గోగి కారి సతీష్, కందాల వెంకటేష్,కరివేద అఖిల్ రెడ్డి, బాచుపల్లి శంకర్, శివప్రసాద్ మయూరేష్, సురేష్, బబ్బులు ధ్రువతేజ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో పటిష్ట భద్రత



**- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టండిజిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్**
**- ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి: జిల్లా ఎస్పీ వి రత్న**

**పుట్టపర్తి,జనసముద్రం న్యూస్,మే 08 :**
ఆంధ్రప్రదేశ్రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుజిల్లాలో పర్యటించే ప్రాంతాలలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) ద్వారా పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు.నేడు ముఖ్యమంత్రి ఉరవకొండ నియోజక వర్గంలోని వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలో హంద్రీనీవా సుజల స్రవంతి ( హెచ్ఎన్ఎస్ఎస్) కాలువ వెడల్పు పనులను పరిశీలించేందుకు విచ్చేయనున్నారు.ఈ నేపథ్యంలో విజయవాడనుండి ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రి పుట్టపర్తి విమానాశ్రయం కి చేరుకుంటారు.ముందుస్త పర్యటన ఏర్పాట్లు భాగంగా ఈ నేపథ్యంలో గురువారం పుట్టపర్తి విమానాశ్రయం నందు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్,ఎస్పీ వీ.రత్న
ఎస్.ఎస్.జి ఆఫీసర్స్ కలిసి అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) నిర్వహించి అన్ని భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.
ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కాన్వాయ్ కి సంబంధించిన రూట్ ను పరిశీలించారు.శుక్రవారం ఉదయం విజయవాడ విమానాశ్రయం నుండి ఉదయం బయలుదేరి ఉదయం 10.50 పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు.అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో ఉదయం 10.55 గంటల నుండిఅనంతపురం జిల్లా,ఉరవకొండ నియోజకవర్గం బయలుదేరి వెళ్తారు,తిరిగి మధ్యాహ్నం 3.00 గంటలకు హెలికాప్టర్లోపుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు.
కొంత సమయం విమానాశ్రయం లో విశ్రాంతి తీసుకొని మధ్యాహ్నం 3.10 నిమిషాలకు బెంగళూరు విమానాశ్రయానికి బయలుదేరి వెళ్తారు.
**ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ**
ముఖ్యమంత్రిపర్యటనఏర్పాట్లనుపకడ్బందీగాచేపట్టాల నిఆదేశించారు.మార్కింగ్ఇవ్వాలని,ఎలాంటిఇబ్బందు లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలని, అంబులెన్స్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు.ఏఎస్-ఎల్(అడ్వాన్స్డ్ సెక్యూరిటీ లైయిజన్) నిర్వహించి అధికారులు చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లుచేపట్టాలని ఆదేశించారు.
ఎలాంటిలోటుపాట్లులేకుండాఏర్పాట్లు ఉండాలన్నారు. సంబంధితశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ పై మండల సమన్వయ సమావేశం

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ మే 8 :**
రాబోయే ఖరీఫ్ సీజన్ యాక్సన్ ప్లాన్ బెస్తవారం లక్కీరెడ్డిపల్లి మండలం పరిషత్ కార్యాలయంలో మండల సమన్వయ సమావేశం మండల వ్యవసాయ అధికారి రమేష్ బాబు ఏపిఎం నిరంజన్ సపీపీ సీఎఎన్ఎఫ్ వైపి హరిప్రియ, ఎన్ఎఫ్ఏ యశోద మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ ల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో ముందుగా ప్రకృతి వ్యవసాయ ఎన్ఎఫ్ఏ యశోద మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ యొక్క ఉద్దేశం చేయబోయే కార్యక్రమం ఇందులోని దశల సన్నాహక,దశ కార్యనిర్వాహన దశ,డేటా సేకరణ దశ గురించి వివరించారు.అనంతరం వ్యవసాయ అధికారి రమేష్ బాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఈ సంవత్సరం చేయబోయి ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక పకడ్బందీగా చేయాలని తెలిపారు.ఇందుకు మా సహకారం తప్పకుండా ఉంటుందని,రైతులు అందర్నీ ప్రకృతి వ్యవసాయంలోకి మార్చాలని కోరారు.అనంతరం ఏపీఎం నిరంజన్ సార్ మాట్లాడుతూ ప్రతి మహిళా సంఘం నుండి ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ కి పూర్తి సహాయ సహకారం అందిస్తామని,మా వంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం మండల డెవలప్మెంట్ ఆఫీసర్ ఎంపీడీవో ఉషారాణి మేడం మాట్లాడుతూ




పంటలకు సంబంధించి ప్రకృతి వ్యవసాయంలో ప్రతి ఒక్కరూ చేయాలని,ఇందుకు కేఏపీలో మేము కూడా సహకారం అందిస్తామని తెలియజేశారు.
అనంతరంజిల్లా నుండి వచ్చిన యశోద మేడం మాట్లాడుతూ కే ఏ పి పకడ్బందీ ప్లాన్ తో ముందుకు వెళ్తున్నామని,ప్రతి రైతును కలిసి ప్లాన్ చేస్తామని తెలిపారు.అనంతరం ఏపీ సీఎన్ ఎఫ్ మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ప్రతి ఒక్కరూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ చేసేటప్పుడు మూడు దశల్లో చేస్తామని,సన్నాహాదశ కార్యాచరణ దశ,డేటా సేకరణ దశ ఈ మూడు దశలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ చేస్తామని ఇందులోని రైతులకు పిఎండిఎస్ వేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా నేలతల్లి వీడియో సార్వత్రిక సూత్రాలు వీడియో, పిఎండిఎస్ వీడియో ప్రదర్శించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఎమ్మెస్ లు,వివోలు,ఓబిలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.